జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 213 విశాఖపట్నం | మంగళవారం 19 ఏప్రిల్ 2022 | 8 పేజీలు | వెల : 5.00

# గృహ నిర్మాణశాఖపై జగన్ సమీక్ష..

## కీలక ఆదేశాలు జారీ



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం గృహనిర్మాణ శాఖపై సమీక్ష చేపట్టారు. ఈ సమీక్షా సమావేశంలో ఎనర్జీ, అటవీ, పర్యావరణ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ఎనర్జీ సెక్రటరీ బి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**హౌసింగ్‌పై సమీక్షలో ముఖ్యాంశాలు..**

ఇళ్లపట్టాలు కోసం చేసిన ఖర్చు కాకుండా కేవలం నిర్మాణం కోసమే గడచిన ఆర్థిక సంవత్సంలో సుమారు రూ.3,600 కోట్లు ఖర్చుచేసిన ప్రభుత్వం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,105 కోట్లు గృహ నిర్మాణం కోసం ఖర్చు చేయనున్న ప్రభుత్వం. ఈ ఏడాది 35 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంటు, 3.46 లక్షల మెట్రిక్‌టన్నుల స్టీల్‌ను ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించనున్న ప్రభుత్వం.

**సమీక్షలో సీఎం ఏమన్నారంటే..**

కోర్టు వివాదాల్లో ఉన్న ఇళ్ల స్థలాలపై వెంటనే ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించిన సీఎం. కేసులు పరిష్కారం ఆలస్యమయ్యే సూచనలు ఉన్నచోట.. ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించే కార్యక్రమం చేపట్టాలన్న ముఖ్యమంత్రి. ఇందులో జాప్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్న సీఎం. కోర్టు వివాదాలు తీరడంతో విశాఖలో 1.43 లక్షల మందికి పట్టాలు ఇచ్చేందుకు సర్వం సిద్ధం. విశాఖలో పట్టాల పంపిణీ పూర్తికాగానే, వాటికి సంబంధించిన ఇళ్ల నిర్మాణ పనులు జూన్‌నాటికి ప్రారంభం అవుతాయన్న అధికారులు. దాదాపు 63 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణంకోసం సమాయత్తమవుతున్న ప్రభుత్వం. ఇక్కడ భూమిని చదును చేయడంతోపాటు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, లేఅవుట్లలో నీళ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సీఎం. 5వేలకుపైగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్నచోట నిర్మాణ సామగ్రిని ఉంచడానికి వీలుగా గోడౌన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించిన అధికారులు. 66 గోడౌన్లలో 47 గోడౌన్ల నిర్మాణం ప్రారంభమయ్యిందన్న అధికారులు.

## నెక్ట్స్ ఏంటి.. రౌడీషీటేనా?: నారా లోకేష్



అమరావతి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. “జగన్‌రెడ్డి... ఇంత పిరికివాడివేంటి.. ప్రశ్నిస్తే కేసు పెడతానంటే ప్రశ్నిస్తూనే ఉంటా. హత్యాయత్నంతో పాటు 11 కేసులు పెట్టావ్. ఇప్పుడు కల్యాణదుర్గంలో మరో కేసు. నీలా ప్రజల సొమ్ము దొబ్బినందుకు నాపై కేసుల్లేవు. ప్రజల పక్షాన నిలబడినందుకు మాత్రమే నాపై కేసులు ఉన్నాయి. మంత్రి పర్యటన సందర్భంగా పోలీసులు ఓవర్ యాక్షన్ చేసి దళిత చిన్నారిని బలిగొన్నారు. చిన్నారి కుటుంబానికి న్యాయం చేయమని అడిగిన నాపై కేసు పెట్టారు. బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడినందుకు 12 కేసులు పెట్టావ్...నెక్ట్స్ ఏంటి? రౌడీషీట్ ఓపెన్ చేస్తావా? దేనికైనా రెడీ అని” సీఎం జగన్ తీరుపై లోకేష్ ధ్వజమెత్తారు.

## పేగుబంధాన్ని కాపాడాలే తప్ప తుంచకూడదు: వెంకయ్య



కృష్ణా: శాస్త్ర, సాంకేతిక ఫలాలు ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడాలే తప్ప బానిసలుగా మార్చకూడదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. సోమవారం ఉపరాష్ట్రపతి వెంకయ్య విజయవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకయ్య మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత సవాళ్లకు పరిష్కారాలను అందించే సాంకేతికతను అందించాలన్నారు. ప్రకృతితో మానవుడికి ఉన్న పేగుబంధాన్ని విజ్ఞానం కాపాడాలే తప్ప, తుంచకూడదని సూచించారు. శాస్త్ర సాంకేతికతలు కొన్నివర్గాల కోసమే కాదు, అవి ప్రజల సంఘటిత అభివృద్ధి కోసమని చెప్పారు. శాస్త్ర, పరిజ్ఞానం సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలన్నదే యలవర్తి నాయుడమ్మ ఆకాంక్ష అన్నారు. మహిళా సాధికారత విషయంలోనూ నాయుడమ్మ దృష్టి కోణం ప్రత్యేకమైనదని వెంకయ్యనాయుడు తెలిపారు.

## నేడు విశాఖలో జగన్ పర్యటన

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటల 25 నిమిషాలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 11గంటల 05 నిమిషాలకు విశాఖకు చేరుకుంటారు. అక్కడినుంచి 11గంటల 50 నిమిషాలకు రుషికొండ పెమ వెల్‌నెస్ రిసార్ట్‌కు వెళ్తారు. అక్కడ హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అవుతారు. సమావేశం అనంతరం మధ్యాహ్నం 1:25 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 2:30 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## జహంగీర్ పురి హింస కేసులో వంద మందిని గుర్తించాం: ఢిల్లీ పోలీస్ కమిషనర్




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని జహంగీర్ పురిలో హనుమాన్ జయంతి శోభాయాత్ర సందర్భంగా చెలరేగిన హింస కేసులో వంద మందిని అనుమానితులుగా గుర్తించినట్లు పోలీస్ కమిషనర్ రాకేశ్ ఆస్థానా తెలిపారు. ఘటనలో మొత్తం 9 మందికి గాయాలయ్యాయని, ఇందులో 8 మంది పోలీసులున్నారని చెప్పారు. ఒక పౌరుడికి కూడా గాయాలయ్యాయన్నారు. ఇప్పటివరకూ 23 మందిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో 8 మందిపై తీవ్ర ఆరోపణలున్నాయని, పాత కేసులు కూడా ఉన్నాయని చెప్పారు. కేసును క్రైం బ్రాంచ్ విచారిస్తోందని, మొత్తం 14 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ ఎవిడెన్స్, సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు ఇతర ఆధారాలను ఇంటలిజెన్స్ బ్యూరో పరిశీలిస్తోందని చెప్పారు. హింసకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టబోమని, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ శిక్ష తప్పదని చెప్పారు. మరోవైపు కొందరు తప్పుడు సమాచారంతో పుకార్లు చేస్తూ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేందుకు యత్నిస్తున్నారని వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్థానా హెచ్చరించారు. పీస్ కమిటీలతోనూ చర్చలు జరుపుతున్నామన్నారు.

## కొత్త ఆర్మీ చీఫ్‌గా మనోజ్ పాండే



న్యూఢిల్లీ: ఇండియన్ ఆర్మీ కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ పాండే పేరు ఖరారైంది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారంనాడు ఒక ట్వీట్‌లో తెలియజేసింది. ఇంజనీర్స్ కార్ప్స్ నుంచి ఆర్మీ చీఫ్‌గా నియమితులవుతున్న మొదటి వ్యక్తి ఆయనే కావడం విశేషం. 29వ ఆర్మీ చీఫ్‌గా ఆయన ఈనెలాఖరులో బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే తన 28 నెలల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో పాండే కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపడతారు.

## జగన్ నిర్ణయాలతో రాష్ట్రం రివర్స్ నడుస్తోంది: చంద్రబాబు



విజయవాడ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలతో రాష్ట్రం రివర్స్ నడుస్తోందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. సోమవారం ఆయన పార్టీ స్ట్రాటజీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ సీఎం మోసపు రెడ్డి పాలనతో అన్నివర్గాల జీవితాల్లో అంథకారం అలుముకుందన్నారు. జగన్ సొంతవర్గం కూడా తీవ్ర అసంతృప్తి, ఆవేదనతో ఉందన్నారు. సీఎం అపరిచితుడి నిర్ణయాలతో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరుగుతోందన్నారు. నెల్లూరు కోర్టులో దొంగల వ్యవహారంలో ముమ్మాటికీ మంత్రి కాకాణి హస్తం ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎంత బలహీనుడో అతని కేబినెట్ చూస్తేనే అర్థమవుతోందన్నారు. ఉత్తరాంధ్రలో మూడేళ్లు దోచుకున్న విజయసాయిరెడ్డి ఇప్పుడు రాయలసీమకు వెళ్లింది అక్కడ దోపిడీ కోసమేనన్నారు. ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి పెన్షన్ ఇవ్వడానికే వాలంటీర్లను పెట్టానని చెప్పిన జగన్... ఇప్పుడు మొదటి వారంలో కూడా పెన్షన్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈనెల 21న టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని చంద్రబాబు తెలిపారు.

ఆలస్యమే!
అయినా
అభిలషణీయమే!
(వివరాలు 4లో..)

## రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు



గువాహటి: తమిళనాడుకు చెందిన 18 ఏళ్ల టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు విశ్వదీన్ దయాళన్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కారులో గువాహటి నుంచి షిల్లాంగ్ వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో అతడు మృతి చెందినట్టు టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టీటీఎఫ్ఐ) తెలిపింది. నేటి నుంచి 83వవ సీనియర్ నేషనల్, అంతర్రాష్ట్ర టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్ ప్రారంభం కానుండగా, పాల్గొనేందుకు సహచరులైన సంతోష్ కుమార్, అవినాష్ ప్రసన్నాజీ శ్రీనివాసన్, కిషోర్ కుమార్‌లతో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో వీరు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. షంగ్‌బంగ్లా ప్రాంతంలో రోడ్డుపై ఎదురుగా వచ్చిన 12 చక్రాలున్న భారీ ట్రైలర్ డివైడర్‌ను, ఆ వెంటనే కారును ఢీకొట్టి పక్కనే ఉన్న గొయ్యిలో పడిపోయింది. ఈ ఘటనలో ట్యాక్సీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన విశ్వను నార్త్ ఈస్టర్న్ ఇందిరాగాంధీ రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్‌కు తరలించారు. అయితే, అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వర్ధమాన టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడైన విశ్వ దీన్ దయాళన్ ఎన్నో టైటిళ్లు గెలుచుకున్నాడు. అంతర్జాతీయంగానూ పలు పతకాలు సాధించాడు. ఏప్రిల్ 27 నుంచి ఆస్ట్రియాలోని లింజ్‌లో జరగనున్న డబ్ల్యూటీటీ యూత్ కాంటెండెర్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. అంతలోనే ప్రమాదంలో అతడు ప్రాణాలు కోల్పోవడం క్రీడారంగంలో పెను విషాదం నింపింది. చెన్నైలోని అన్నానగర్‌లో ఉన్న కృష్ణస్వామి టీటీ క్లబ్‌లో రామ్‌నాథ్ ప్రసాద్, జై ప్రభురామ్ వద్ద శిక్షణ పొందాడు. విశ్వ మృతికి మేఘాలయ టేబుల్ టెన్నిస్ అసోసియన్ ఉపాధ్యక్షుడు బ్రూస్ పి మారక్, ప్రధాన కార్యదర్శి చిరంజీబ్ చౌదరి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా విశ్వ మృతిపై స్పందించారు. విశ్వ మృతి తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, బాధాకరమని అన్నారు. అతడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు కూడా సంతాపం తెలిపారు.



# ఎందరికో ప్రేరణ ..రాజకీయ స్ఫూర్తి పిన్నమనేని కోటేశ్వరావు



మచిలీపట్నం,ప్రజాపాలన ప్రతినిధి : కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు తమకు ఎంతో స్ఫూర్తిని, ప్రజాసేవ చేయాలనే ప్రేరణ కల్గించారని పలువురు వక్తలు భావోద్వేగానికి లోనయ్యారు. జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పిన్నమనేని కోటేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం ఉదయం ఆవిష్కరించారు. ఆయన ప్రసంగానికి ముందు పలువురు నేతలు ప్రసంగించారు. తొలుత జడ్పి చైర్ పర్సన్ సభాధ్యక్షులు ఉప్పాల హారిక మాట్లాడుతూ, 1964 సంవత్సరంలో కృష్ణాజిల్లాలో కాకాని వెంకటరత్నం, చల్లపల్లి రాజా, ఎం. ఆర్. అప్పారావు, పుచ్చలపల్లి సుందరయ్య, వంటి మహా రాజకీయ నేతలు ప్రభంజనం కృష్ణా జిల్లాలో ఉన్న సమయంలో 33 ఏళ్ళ ప్రాయంలో జిల్లా పరిషత్ ఛైర్మెన్ గా పిన్నమనేని కోటేశ్వరరావు ఎంపిక కావడం ద్వారా ఆయన లోని నాయకత్వ లక్షణాలకు నిదర్శనమన్నారు. ప్రజాసేవ చేసే అవకాశం ఉంది కనుకే రాజకీయాలలో ప్రవేశించానని పలు సందర్భాలలో ప్రస్తావించారని తెలిపారన్నారు. రెండు దశాబ్దాలకు పైగా జడ్పి చైర్మెన్ గా ప్రజా హృదయాలలో ఈనాటికి చెరగని ముద్రగా నిలిచారని ఆమె అన్నారు. అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ, ఛైర్మెన్ అనే మాటకు పిన్నమనేని కోటేశ్వరావు పేరు పర్యాయపదంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈనాటికి మారుమోగుతుందన్నారు. కృష్ణాజిల్లా ప్రజలకు రాజకీయ స్ఫూర్తిప్రదాత, నైతిక విలువల పట్ల నిబద్ధత, వినయం, తగ్గించుకొనే తత్వం ఎంతో గొప్పదని అన్నారు. తాను ఒకటిరెండు సార్లు ఆ మహనీయునితో కలిసి భోజనం చేసే భాగ్యం దక్కిందన్నారు. ఆయన ఆహారం తీసుకునేటప్పుడు ఒక్క మెతుకు సైతం కిందపడకుండా జాగ్రత్త పడేవారు. ఎంత మేరకు తినగలనో అంతవరకే తినేవారని ఆహారం వృధా చేయడం ఎంతో తప్పని చెబుతుండేవారని మంత్రి జోగి రమేష్ జ్ఞాపకం చేసుకొన్నారు. తన చిన్నప్పుడు ఎన్నికల ప్రచారం సమయంలో పిన్నమనేని కోటేశ్వరరావును గెలిపించామని అభ్యర్థిస్తూ ఆయన పేరును గోడలపై రాసే అదృష్టం తనకు దక్కిందన్నారు. కృష్ణాజిల్లా పరిషత్ ఛైర్మెన్ జనరల్ స్థానాన్ని బి సి మహిళను ఎంపిక చేసి ఆ పీఠం మీద కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆలోచన విధానం బిసి ఎస్సి ఎస్టీ ప్రజల పట్ల ఆయన కున్న చిత్తశుద్ధి అమోఘమన్నారు. తర్వాత ప్రసంగించిన మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య ( నాని ) ప్రసంగిస్తూ, పిన్నమనేని కోటేశ్వరావు విగ్రహావిష్కరణకు ఇంత దూరం విచ్చేసి ఆయన గౌరవాన్ని నిలబెట్టిన ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు తన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు తెలిపారు. నాటి నుండి ఈనాటి వరకు తాను పిన్నమనేని కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా కొనసాగుతున్నానని, పిన్నమనేని కోటేశ్వరరావు తనకు రాజకీయ గురువని పేర్కొన్నారు. కేవలం రాజకీయ నాయకునిగానే కాకుండా జిల్లాలోని ప్రతి మారుమూల ప్రాంతంలోనూ , పిన్నమనేని కోటేశ్వరావుకు ప్రజల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్నారన్నారు. ఆయన రెండు సార్లు శాసనసభ్యునిగా గెలుపొందినప్పటికీ పిన్నమనేని కోటేశ్వరావు మక్కువ మనస్సు అంత స్థానిక సంస్థల పరిపాలనపైనే ఉండేదన్నారు. తన తండ్రికి ఆయనతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా తనను ఎంతో అభిమానంగా చూసుకునేవారని ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. తనను స్వంత శిష్యునిగా భావించి ప్రతి విషయంలో దిశా నిర్దేశం కల్గించారన్నారు. తనకు ఎమ్మెల్యే సీటు ఇప్పించడమే కాకుండా రాజకీయాలలో ఎలా ఉండాలి అనేది ఆయన నేర్పిన పాఠమేనని అన్నారు. పదవులు వస్తా ఉంటాయి..పోతా ఉంటాయి కానీ రాజకీయాలలో నీకంటూ ఒక వర్గం ఉంటే, ఎప్పటికి రాజకీయ నాయకునిగా నిలబడతావని తనతో పదే పదే చెప్పేవారని పేర్ని నాని గుర్తు చేసుకొన్నారు. ఆయన సైతం అలానే జీవించారని అన్నారు. పిన్నమనేని కోటేశ్వరావను బట్టి జిల్లా పరిషత్ ఛైర్మెన్ గిరికి విలువ పెరిగిందన్నాబు. అనంతరం కె.వి. చౌదరి మాట్లాడుతూ, వయస్సులో గాని హొదాలో గాని చిన్నా పెద్ద తారతమ్యాలు లేకుండా ప్రతివారినీ సోదరభావంతో గౌరవిస్తా అందరితో కలిసిపోయే మంచి మనస్సు ఉన్న వ్యక్తి పిన్నమనేని కోటేశ్వరావు అని అన్నారు. కోపం ఈర్ష్య గర్వం అనే శబ్దాలు ఆయన డైరీలో లేవని అన్నారు. ఉత్తముడు సౌమ్యుడిగా కార్యసాధకునిగా సంకల్పశుద్ధి కలవాడని ఈనాటికి ప్రజలలో కీర్తి గడించారని అన్నారు. చిన్ననాటి నుండే సోషలిస్టు బావాలు కల్గిన రాజకీయ నాయకునిగా ప్రవేశించారు. నేతలలతోనే కాక సాధారణ కార్యకర్తలతో సైతం పిన్నమనేని కోటేశ్వరావుకు సత్ సంబంధాలు ఉండేవన్నారు. ప్రాథమిక విద్య, సమగ్ర గ్రామీణాభివృద్ధి, సమగ్ర ఆర్థిక అభివృద్ధి కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కృష్ణాజిల్లా నేడు ఆక్వా కల్చర్ లో దేశంలోనే మొదటి స్థానంలో ఉందంటే, ఆ రంగాన్ని ఎంతో ప్రోత్సహించిన ఘనత ఆయనకే చెల్లుతుందన్నారు. లోతట్టు భూములు చిత్తడి భూములు చౌడు భూములను చేపల సాగుకు అనుకూలంగా మార్చుకొని ఈ ప్రాంతంలో నీలి విప్లవానికి పునాదులు వేసి చేపల చెరువుల సాగును ఎంతో ప్రోత్సహించిన ఆద్యులు పిన్నమనేని కోటేశ్వరావు అని అన్నారు. 1967 ప్రాంతంలోనే దళితులకు పక్క ఇళ్ళు అవసరమని భావించి రుద్రపాక సమీపంలోని గాజులపాడు గ్రామంలో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేత పక్క ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభించారన్నారు.



ఆంధ్ర ప్రదేశ్ సచివాలయం బ్లాక్ 3 లో బాధ్యతలు చేపట్టిన సాంఘీకసంక్షేమ శాఖ మంత్రి గా డా: మేరుగ నాగార్జున కు పుష్ప గుచంతో అభినందనలు తెలిపిన చిలుమూరు తెనాలి ఎంపీటీసీ అంబేద్కర్ టివి ఛానల్ డైరెక్టర్ అమిరి శెట్టి శ్రీధర్ మరియు వేమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు , వైసీపీ రాష్ట్ర నాయకులు డేవిడ్ రాజు ,బాబురావు,నవీన్ మరియు వైఎస్ ఆర్ సి పి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గురజాల అత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తు: మహిళా కమిషన్

అమరావతి, (ప్రజాపాలన, క్రైమ్ బ్యూరో) : పల్నాడు జిల్లా గురజాల రైల్వే హాల్ట్ లో మహిళపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసేందుకు కేసు దర్యాప్తును ముమ్మరం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ రైల్వేపోలీసులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం ఆమె విజయవాడ రైల్వే ఎస్పీకి కమిషన్ తరఫున లేఖను పంపారు. కేసు నమోదు చేసిన నడికుడి రైల్వే పోలీస్ సీఐ శ్రీనివాసరావుతో ఆమె ఫోన్ లో మాట్లాడి ఘటన వివరాలను ఆరాతీశారు. బాధితురాలి ఆరోగ్యంపై వాకబు చేశారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు రైల్వేతో పాటు పోలీసుశాఖాపరంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును శరవేగంగా చేధించాలని కోరారు. సభ్యసమాజం సిగ్గుపడాల్సిన ఇటువంటి సంఘటనలను ప్రతీ ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని వాసిరెడ్డి పద్మ కోరారు. బాధితురాలు ఆరోగ్యం కుదుటపడి స్వస్థలానికి వెళ్లేవరకు ఆమెను, తనతో ఉన్న చంటిబిడ్డ సంరక్షణ బాధ్యతను స్థానిక మహిళా శిశుసంక్షేమశాఖ చూసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

## ఉపరాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్18: రాష్ట్రంలో రెండు రోజుల పర్యటన అనంతరం సోమవారం విశాఖపట్నం వెళుతున్న భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కి గన్నవరం విమానాశ్రయం లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లాకలెక్టర్ రంజిత్ భాషా, ఎస్పీ సిద్ధార్థ్ కౌశిల్, ప్రోటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యరెడ్డి, మాజీ మంత్రి డా.కామినేని శ్రీనివాస్. ఎయిర్పోర్ట్ డైరెక్టర్ రామారావు, ప్రభృతులు పాల్గొన్నారు. ఉప రాష్ట్రపతి వెంట మిజోరాం గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు దంపతులు కూడా విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు.

## పార్స్ పొన్నూరు లేబర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా కర్రా సుధాకర్ నియామకం




ఏప్రిల్ 18 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) పొన్నూరు లేబర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా కర్రా సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్స్ స్టేట్ కోఆర్డినేటర్ కటికల రవికుమార్, కర్రా సుధాకర్ ను పొన్నూరు లేబర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలో రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కర్రా సుధాకర్ నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## చట్టప్రకారం మాకు న్యాయం చేయండి



వినుకొండ ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి):వినుకొండ రెవిన్యూ గ్రామ సర్వే నెంబర్ 829 బై 2%ఎ% గా 5.10 సెంట్లు భూమిని 949 బై 1 లో 2.55 సెంట్లు 999 బై 2 లో2.55 సెంట్లు వెరసి 5.10 సెంట్లు భూమిని 1927వ సంవత్సరంలో డీకే పట్టా ఇచ్చి ఉన్నారు. సదరు డీకే పట్టా భూమి ని రిజిస్టరు విక్రయ దస్తావేజు 6–8–1951 తేదీన రిజిస్టర్ ద్వారా మా పూర్వీకులు కొనుగోలు చేసినారు. అప్పటినుండి సదరు 5–10 సెంట్లు భూమి స్వాధీనం అనుభవ పత్రములు ఉండి 1%దీ% లో మా పేర్లు నమోదు కాబడి పాస్ బుక్ అనుభవించు చున్నాము. 1954 సంవత్సరాలకు ముందు ఇచ్చిన డీకే పట్టా భూముల పై పూర్తి హక్కులు కలవు వినుకొండ డిగ్రీ కాలేజీ వారికి ఎటువంటి సంబంధం హక్కు లేదు మేము కోర్టులో 1988 గతంలో గౌరవ నీయులైన ఏపీ హైకోర్టు లో దాఖలు చేసి ఉన్నారు. చట్టప్రకారం మాకు న్యాయం చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఈరోజు వినుకొండ తాసిల్దార్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్కే కాలేషా ఎస్కే సైదా ఎస్కే నాగూర్ ఎస్కే బాబు కరీముల్లా మీరావలి బాజీ తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా మహిమాన్విత శ్రీ జై ష్టలక్ష్మి సమేత శ్రీ శనీశ్వర స్వామి దేవస్థానము నిర్మాణము



వినుకొండ ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి):దేశంలోనే రెండవదిగా మన రెండు తెలుగు రాష్ట్రాల లోనే మొట్టమొదటిసారిగా ఆగమ శాస్త్ర విధానాలతో శరవేగంగా నిర్మాణమవుతున్న మహిమాన్విత శ్రీ జై ష్టలక్ష్మి సమేత శ్రీ శనీశ్వర స్వామి దేవస్థానమునకు గడిచిన వారం రోజులలో భక్తులే స్వయంగా దేవస్థానం వద్దకు విచ్చేసి సమర్పించిన విరాళములు రెండు లక్షల 69 వేల 864 రూపాయలు అని తెలిపారు. వినుకొండ పట్టణ మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ యాదల. మహేశ్వర రావు, ధర్మపత్ని అనురాధ 2 లక్షల 11 రెండువేల నూట పదహారు రూపాయలు, వినుకొండ టౌన్ కొత్తపేట జమ్ముల. నరసరావు, ధర్మపత్ని ఆదిలక్ష్మి 25 వేల రూపాయలు, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం అగ్రహారం కు చెందిన అమర. శ్రీనివాస రావు ధర్మపత్ని పావని 11 వేల నూట పదహారు రూపాయలు, వినుకొండ టౌన్ కొత్తపేట 5వ లైన్ కు చెందిన అచ్యుత. హాయ్ రామ్ కుమార్ ధర్మపత్ని శ్రీదేవి 11 రెండువేల 516 రూపాయలు, వినుకొండ ఆగా భావి సని శెట్టి. విజయలక్ష్మి 11 వేల నూట పదహారు రూపాయలు, ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షులు జానపాటి. పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కోట. రమేష్, ఉపాధ్యక్షులు ఆర్. శ్రీనివాసరావు, కామిశెట్టి. గురువులు కార్యదర్శి సహాయ కార్యదర్శులు %ు%. కేశవ బాబు, శాసనాల .నాగేశ్వరరావు కోశాధికారి సాయి కృష్ణ, %ూ%. తేజ కుమార్, రాముడు, కూరాకుల. రాము, కోటేశ్వరరావు మరియు 30 మంది కమిటీ సభ్యులు పాల్గొన్నారని తెలిపారు.

## కుల మంత్రులు వద్దు... సామాజిక మంత్రులు ముద్దు



రాజమహేంద్రవరం : ప్రజాపాలన ప్రతినిధి:కుల సమీకరణలతో మంత్రివర్గం కులాలను దోచుకోవటానికేనా ! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి)ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో ఆర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఎద్దేవా చేసారు. కులాల వారిగా మంత్రులను ప్రకటించి ఆంధ్రప్రదేశ్ లో సామాజిక ద్రోహం చేసారని, సామాజిక పాలన ముసుగులో కులాలకు మంత్రి బ్యాడ్జిలు తగిలించటం దారుణమని, కుల సామాజిక వర్గం తో మంత్రులుగా ప్రమాణం చేసిన ఏ ఒక్క మంత్రి అయినా ఆ కులంలో వున్న మెజార్టీ పేదరికాన్ని తుడిచి సంపన్నులుగా తీర్చి దిద్దుతాను అని చెప్పగలిగే దమ్మున్న మంత్రి ప్రస్తుత మంత్రి వర్గంలో వున్నారా ! కులం ముసుగులో సంపదను దోచుకోవటం తప్ప సామాజిక అభివృద్ధి కి దోహద పడగలరా అని, చట్టబద్ధంగా ప్రమాణ స్వీకారం చేసి కుల మంత్రులుగా ప్రకటించుకోవడం సిగ్గుమాలిన చర్య అని, ఈ తరహా మంత్రి వర్గ విస్తరణ కారణంగా సామాజిక అభివృద్ధి కుంటుపడుతుందని, మంత్రి హోదా ప్రజలకు ఆ శాఖకు భరోసాగా వుండాలని, అంతేగాని భారంగా వుండరాదని, ప్రస్తుత మంత్రులు జీతాలు తీసుకోవటానికి, ప్రోటోకాల్ పొందటానికి, ప్రజల శ్రమను దోచుకోవడానికి మాత్రమే మంత్రి హోదాను అనుభవిస్తున్నారని,భాద్యతా హితమైన సేవలు చేయగల మంత్రులు లేకపోవటం ప్రజల దురదృష్టం అని, కుల స్టిక్కర్లతో ఏపిలో మంత్రులు వద్దని, సామాజిక భాద్యత గల మంత్రులే ముద్దు అని ఆయన కోరారు. ఓట్ల రాజకీయాలకు ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించవద్దని, కుల మత రహిత సేవలు అందిస్తాను, పక్షపాతం, బలహీనతలకు తావు లేని చట్టబద్ధమైన సేవలు అందిస్తాను అని రాజ్యాంగ బద్ధంగా ప్రమాణం చేసిన మంత్రులు కుల మంత్రులుగా ప్రచారం పొందటం దారుణమని, గవర్నర్ సాక్షిగా చట్ట వ్యతిరేక చర్య కదా అని, ఏ నాయకుడికి ఒక కులం వారు ఓట్లు వేయరని, అన్నివర్గాల వారికి అండగా వుంటారు, న్యాయం చేస్తారు, మన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారు అనే ఒకే ఒక్క నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తుంటే గెలిచిన నేత పాలు త్రాగుతు రొమ్ముగుద్దే రోత పాలనకు వెన్ను దన్నుగా నిలుస్తున్నారని, సొంత కులం అభివృద్ధి ని, ఆ నిధులను తన స్వార్థానికి దోచుకుంటున్నారని, ప్రజలను ఓటుకు నోటుకు బానిసలను చేస్తు మరోపక్క సొంత కులాల్లో వివాదాలు సృష్టిస్తు రాజకీయ లబ్ది పొందుతున్నారని, ప్రతి కుల నాయకుడు దోచుకోవటం, దాచుకోవటం తప్ప మెరుగైన పాలన పై దృష్టి సారించటం లేదని,మంత్రి గారు వున్న ప్రాంతంలో సొంత కులంలో కడుపేదరికం వున్నవారు ఎందుకంటున్నారో ప్రజలు ఆలోచించిన నాడు ఈ కుల నేతల అడ్రస్ లు గల్లంతవ్వటం ఖాయమని ఆయన హెచ్చిరించారు. కుల మంత్రులు కారణంగా ఆ ఆ కులాలు సంపన్నులుగా ఎదుగుతున్నారా అంటే అలాంటిదేమి లేదని, డా. బి ఆర్ అంబేద్కర్ ను బూచిగా చూపిస్తు ప్రధాన రాజకీయ పాలక పార్టీలు ఆ మహనీయుడును మోసం చేస్తున్నాయని, స్వాతంత్ర్య అనంతరం 75 ఏళ్లుగా రాజ్యాంగాన్ని ధనిక వర్గాల అభివృద్ధికి తూట్లు పొడుస్తూనే వున్నారని,రాజ్యాంగ హక్కులను, ఫలాలను పేదవానికి అందని ద్రాక్ష గానే మిగిల్చారని,రాజ్యాంగాన్ని ఆర్థిక నేరగాళ్లు రామఫలంగా బుజిస్తూ పేదోడి వెన్నును ముక్కలు చేస్తున్నారని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నేడు అక్రమార్కులకు, కార్పొరేట్ సంస్థలకు మెత్తని దిండు వలే ఉపయోగపడుతుందని, పేదోడు రాజ్యాంగాన్ని భగవద్గీత, ఖురాన్, బైబిల్ వలే పూజిస్తుంటే పాలకులు రాజ్యాంగాన్ని స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని, రాజ్యాంగ స్ఫూర్తి సమానంగా ఉన్నప్పటికీ రాజ్యాంగ హక్కులు సమానంగా అమలు కావడం లేదని ఆయన తీవ్ర ఆవేదన చెందారు. ఆంధ్రప్రదేశ్ లో మంత్రులకు ప్రాధాన్యత లేదని, ప్రస్తుత మంత్రులు విజిటింగ్ కార్డు మంత్రులని, బుగ్గ కారులో జల్సాగా తిరగటం తప్ప సంబంధిత మంత్రిత్వ శాఖకు ఏ మేలు చేయలేకపూతున్నారని, మంత్రి అసమర్థతను చాటుకుంటున్నారని,మంత్రి స్థానానికి న్యాయం చేయలేక నెల జీతాలు తీసుకుంటు అవినీతికి, కుంభకోణాలకు, అక్రమాలకు వారసులుగా చరిత్ర హీనులుగా నిలిచిపోతున్నారని, ఏపిలో పేరుకు మాత్రమే మంత్రులుగా కొనసాగుతున్నారని పాలన అంత అదృశ్య వ్యక్తులు సూచనల మేరకే సాగుతుందని, ఏ మంత్రికి వారి శాఖలపై పట్టు లేదని, అవగాహన సైతం లేకుందని, కొంతమంది మంత్రులకైతే అర్హతను బట్టి కాకుండా అధినేత భక్తితో అదృష్ట వసాత్తు దక్కిన పెదవులని, కొన్ని శాఖల మంత్రులైతే బయట ప్రయివేట్ వ్యక్తులు సిద్ధం చేసుకొచ్చిన ఫైల్స్ పై సంతకాలు చేసి ముడుపులుతో జేబు నింపుకుంటున్నారని, నేటి మంత్రి వర్గంలో రూల్స్ ను, చట్టాలను, న్యాయ నిబంధనలును పాటించేవారు లేకపోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజల దురదృష్టం అని, నేడు ప్రజాసేవతో అర్హత గల నేతలు చట్టసభలకు ఎన్నిక కాకపోవటం విచారం అని, రాజ్యాంగ బద్దమైన పాలన అమలు జరిగినప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ వుంటుందని,రాజ్యాంగ నిర్మాత కు అసలైన గౌరవం దక్కుతుందని ఆయన తెలిపారు. బాబాసాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాలను నేటి పాలకులు రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్నారని, ప్రపంచ మేధావి అంబేద్కర్ ను పెట్టుబడి వర్గాలు, కొన్ని సంపన్న వర్గాలు ఒక వర్గానికి పరిమితం చేస్తు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్పిసున్నారని,పేదరికం లేని నవ సమాజం ఏర్పడిన నాడే అంబేద్కర్ కు నిజమైన నివాళులు అర్పించినట్టని, అంబేద్కర్ కలలు కన్న రాజ్యాంగ భద్రత, పౌర భద్రత, అస్పృశ్యత నిర్మూలన సాధించాలంటే ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమ నిర్మాణం తోనే సాధ్యం అని ఆర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలిపారు. సభకు ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డివిఆర్ మూర్తి, కాసా రాజు,ఎండి హుస్సేన్,దుడ్డె త్రినాద్ , బర్ల ప్రసాద్ , దుడ్డె సురేష్, వర్ధనపు శరత్ కుమార్ , వాడపల్లి జ్యోతిష్,పిల్లాడి ఆంజనేయులు, వల్లి వెంకటేష్, ముప్పన రమేష్,మట్టపర్తి తులసి , మీర్జా నాజర్, కాకి శివ ప్రసాద్, మండవల్లి సూరిబాబు, రెడ్డి స్వర్ణ లత, కోట సుశీల తదితరులు పాల్గొని యున్నారు.

## రేషన్ బియ్యానికి నగదు పథకంపై సిపిఎం నిరసన



నరసాపురం, ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) : రేషన్ బియ్యంకు నగదు బదిలీ పథకం వద్దని రేషన్ ద్వారా సన్నబియ్యం ఇవ్వాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ రేషన్ బియ్యానికి బదులుగా నగదు రూపంలో డబ్బులు చెల్లిస్తామని చెబుతున్న ప్రభుత్వం రేషన్ ద్వారానే ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాకు నగదు బదిలీ పథకం ద్వారా డబ్బులు వద్దని గత ఎన్నికల్లో సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. నగదు బదిలీ పథకం ద్వారా ప్రజలకు ఆహార పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో ఒక భాగమేనని ఆయన విమర్శించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిస్తున్న బియ్యం నాణ్యతాలోపంగా ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు అంగన్వాడి సెంటరుకు, మధ్యాహ్నం భోజనం పథకంకు మరియు ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు అందజేస్తున్న బియ్యంలో నాణ్యత కరువైందని ఆయన అన్నారు. తక్షణమే ఈసంస్థలకు నాణ్యమైన సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కందుల బాజి సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొన్నాడ రాము, నోముల కొండ, మంచిలి నీలకంఠం, మహమ్మద్ అజిత్, తెలగంశెట్టి సత్యనారాయణ, కే సోమేశ్వర రావు, జగన్, కౌరు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు చిక్కిన మోటారు దొంగలు

### చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు



నందిగామ ఏప్రిల్ 18 ఇది ప్రజా పాలన ప్రతినిధి: గడి చిన వారం పది రోజులుగా రైతుల పొలాల్లో వాడు కునే విద్యుత్ మోటార్లు వరుసగా సినీ ఫక్కీలో దొంగ తనాలు జరుగుతున్నాయి దొంగలు గుట్టుచప్పుడు కాకుండా మోటార్లు బిగించిన ప్లాట్ ఫామ్ దానికి ఉ న్న ఇనుప త్రెడ్స్ మోటార్లు తగిలించిన పైపు చాకచ క్యంగా కోసి దాన్ని పెకిలించి తీసుకు వెళు న్నారు అ యితే మీరు ఒకటి రెండు మూడు కాదు తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల్లో సుమారు50 విద్యుత్ మోటార్లు దొం గతనం చేశారు అయితే దొంగలు ఎక్కడో అక్కడ అ దొరకటం ఖాయం. అదే నందిగామ ప్రాంతంలో జరి గింది ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా ఆదేశాల మేరకు స్థానిక డిఎస్పీ నాగేశ్వర్రెడ్డి సి ఐ కనకారావు ఆధ్వర్యంలో ఎస్ ఐ లు పండుగ సురే ష్ లు కొంతమంది కానిస్టేబుల్ సహకారంతో రాత్రి సమయంలో వెళ్తున్న ఆటోని అడ్డగించి విచారించగా దానిలో పాత మోటార్లు కనబడిన వెంటనే వారిని తీసుకొని ఆటోను ముద్దాయిలను పోలీస్ స్టేషన్ కి అప్పగించారు ఈ దొంగిలించిన సొత్తును విలువ సు మారు ఏడున్నర లక్షల వరకు ఉంటుందని అంచనా వీరిని పట్టుకున్న కానిస్టేబుల్స్ కు నజరానా ప్రకటిం చారు దానితో పాటుగా శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా డిఎస్పి నాగేశ్వర్రెడ్డి మాట్లాడుతూ ఈ కే సు చాలా ప్రాముఖ్యమైనది పోలీస్ సిబ్బంది చాలా చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారని తెలిపారు సిఐ కనకారావు మాట్లాడుతూ ఈ కేసు ఛాలెంజ్ గా మారిందని కేసును ఛేదించి ముద్దాయిలను పట్టుకు న్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఎవరైతే బా ధితులున్నారో రైతులకు విచారించి వారికి అప్పగిస్తా మని తెలిపారు ఈ కార్యక్రమంలో పండుదొర సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలి



భీమవరం, ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) : స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు నాణ్యమైన మంచి పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి సుమారు 110 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందే వినతుల పరిష్కారం తీరు అర్జిదారుడు సంతృప్తి చెందేలా వుండాలని అన్నారు. తిరిగి ఫిర్యాదు రాకుండా చక్కటి పరిష్కార తీరుతో ఫిర్యాదు దారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులో సత్వర పరిష్కారం చూపాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదిదారుల సమస్యలను పెండింగ్ లేకుండా అర్జీలను అర్థవంతంగా పరిష్కరించాలని ఆమె సూచించారు. జిల్లాలో ఇ– ఆఫీస్ ఫైళ్లను ఏలూరు ఆఫీసుకు బదిలీ చేసేందుకు ప్రతి జిల్లా అధికారి ఒక నోడల్ అధికారి పేరు, కాంటాక్ట్ నెంబర్ ఇవ్వాలని ఆమె అన్నారు. ఇ– ఆఫీసులో మొత్తం ఫైళ్ళన్నీ పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చాయని ఏలూరు జిల్లాకు సంబంధించిన ఫైళ్లను ఆజిల్లాకు పంపించేందుకు విధిగా నోడల్ అధికారిని పేరు, ఫోన్ నెంబర్ అందజేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె .క్రిష్ణవేణి, వివిదశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వాలంటీర్లు నిజమైన ప్రజా సేవకులు: మేడపాటి షర్మిళ రెడ్డి



రాజమహేంద్రవరం సిటీ: ప్రజా పాలన ప్రతినిధి ఏప్రిల్ 18:సోమవారం ,46,45, వార్డులలో సచివాలయ లలో పనిచేసే వార్డు వాలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసిన రుడా చైర్పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి 46 వార్డ్ ఇంచార్జ్ మేడబోయిన సునీల్ కుమార్ 45 వ వార్డు కసే రాజేష్ఈ సందర్భంగా రుడా చైర్పర్సన్ మాట్లాడుతూ,మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలన చూసి గ్రామ వాలంటరీ వ్యవస్థ తీసుకువచ్చారు, అంతేకాకుండా మన ప్రభుత్వం ఇచ్చే ప్రతి సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలని ఆలోచించి వాలంటరీ లను ప్రభుత్వానికి వారధిగా చేశారు, వాలంటీర్లను 50 కుటుంబంలో ఒకరిగా సమున్నతమైన స్థానం కల్పిస్తూ ఇప్పుడు సేవ వజ్రం, సేవా రత్న, సేవా మిత్ర, పురస్కారంలను ఇచ్చి మిమ్మల్ని ఉన్నతమైన స్థానం కల్పించి గౌరవమైన వాలంటరీగా చేసిన ఘనత మన సీఎం కి చెందిందని చెప్పారు. మన ప్రభుత్వం వైపు దేశమంతా చూసే విధంగా చేస్తున్నా మీసేవ మాటల్లో చెప్పలేనిది, మీరు కరోనా విపత్కర పరిస్థితుల సమయంలో గ్రామ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కరోనా రోగులకు అందించిన. మీ సేవలు వెలకట్టలేని అని అన్నారు. వార్డులలో సమస్యలు ఉంటే మా ఇంచార్జ్ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ ,వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. మరియు 46,45 పెద్దలు చక్కర రావు పల్లంరాజు శ్యామ్ శివ శ్రీను ధనరాజ్ శంకర్ .బి శ్రీను చంద్ర రావు సోనీ నీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చక్ర సిమెంట్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం

### ప్రారంభించిన శ్రీచక్ర సిమెంట్స్ జనరల్ మేనేజర్ సైదారెడ్డి




కారంపూడి..ఏప్రిల్18...ప్రజాపాలన... ప్రతినిధి :వేసవికాలంలో పేదప్రజల దాహార్తిని తీర్చాలానే ఉద్దేశంతో శ్రీచక్ర సిమెంట్స్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ఎదురుగా మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని శ్రీచక్ర సిమెంట్స్ జనరల్ మేనేజర్ సైదారెడ్డి తెలిపారు. కార్మికులు వివిధశాఖల అధికారులతో కలిసి చలివేంద్రాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం సైదా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అన్ని దానలాకంటే నీటి దానం చాలా గొప్పదని గుక్కెడు నీరు మనిషి ప్రాణాన్ని కాపాడుతుందని వేసవికాలంలో ఫ్యాక్టరీకి వచ్చే ఏ ఒక్కరు కూడా మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని పేదప్రజలు,కార్మికులు, లారీడ్రైవర్లు, క్లీనర్లు, ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణించే ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీచక్ర సిమెంట్స్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లింగమూర్తి, పర్సనల్ మేనేజర్ మురళి, శ్రీచక్ర పలు విభాగల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రగతి కళామండలి 72వ వార్షికోత్సవ వేడుకలు



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి : సత్య ధ్యానమందిరంలో ప్రగతి కళామండలి 72వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో తొలుత నటరాజ పూజ,పత్రిక జగన్నాథరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పులి నాటిక ను ప్రదర్శించారు. తర్వాత జరిగిన సభాకార్యక్రమం అధ్యక్షులు లయన్ కంబాల వెంకటేశ్వరరావు అద్యక్షతన జరిగిన సభాకార్యక్రమం లో పలువురు వక్తలు నాటకరంగం గురించి,ప్రగతి కళామండలి నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్స్ పుల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ నాటికలు సమాజం మీద ప్రభావం చూపుతాయి అని,కొన్ని సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి అన్నారు. వారి అనుభవాలను సభలో మాట్లాడిన విధానం పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ప్రగతి కళామండలి కార్యవర్గ సభ్యులు జడ్జి నరేంద్రరెడ్డి ని ఘనంగా సత్కరించారు. మరో విశిష్ట అతిథి పత్రి జగన్నాథరావు పురస్కార గ్రహీత అభినయ శ్రీనివాసరావు ని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ 72 సంవత్సరాలు గా పరిషత్తు లను నిర్వహిస్తున్నాం ప్రభుత్వ పరంగా గుర్తింపు రాలేదని, భవిష్యత్ లో ప్రభుత్వ పరంగా సాంబయ్య మాష్టారు అవార్డు ప్రధానానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. నూతలపాటి సాంబయ్య రచించిన జీవనవేదాలు..గుండెనాదాలు పుస్తకావిష్కరణ జడ్జి నరేంద్ర రెడ్డి ఆవిష్కరించారు. సాంబయ్య మాష్టారిని కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన అగ్ని పరీక్ష నాటిక పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో డా. షకీలా శ్రీధర్ ,డా. జి శ్రీధర్ డా గీతా హసంతి జింకా రామారావు ఇర్మియా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### కారుమూరి, ముదునూరిలకు ఎమ్మెల్యే గ్రంధి అభినందనలు



భీమవరం, ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రిగా కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ గా ముదునూరి ప్రసాదరాజు నూతనంగా నియమితులైన సంధర్భంగా సోమవారం భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సంధర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజును శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. సుమారు గంటకు పైగా మంత్రి, చీఫ్ విప్ లు గ్రంధి శ్రీనివాస్ నివాసంలో సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని శాఖాపరంగా పేద ప్రజలకు మరింతగా ప్రభుత్వ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, గుణ్ణం నాగబాబు, ఏడిదకోట సత్యనారాయణ, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహ రాజు, కోడే యుగంధర్, గొట్టుముక్కల పద్మరాజు, ఏఎస్ రాజు, ఆకుల సుబ్బలక్ష్మి, చిగురుపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రంను ప్రారంభించిన జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి



తూర్పు గోదావరి జిల్లా : తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, ఎండాకాలం నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుండి జిల్లా పోలీసు కార్యాలయంకు స్పందన కార్యక్రమానికి వచ్చు ఫిర్యాదుదారుల దాహార్తిని తీర్చేందుకు గాను ఆఫీస్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వచ్చిన వారందరికీ మజ్జిగ, రోజు మిల్క్ మరియు చల్లటి మంచినీళు (ఆర్ ఓ పురిఫైడ్ వాటర్ ను అందజేశారు.

## గోపాలపురంలోని బీజేపీ కార్యాలయంపై రాజకీయం పన్నుతున్న అధికారులు..



కోనసీమ జిల్లా: ప్రజాపాలన ప్రతినిధి:కోనసీమ జిల్లా,రావులపాలెం మండలం పరిధిలోని గోపాలపురంలోని జాతీయ రహదారి చెంతనే ఉన్న బీజేపీ కార్యాలయాన్ని మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పెయ్ విగ్రహాన్ని తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దింశెట్టి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు ఆయన మాట్లాడుతూ ఈ స్థలంలో ఎన్నో సంవత్సరాలుగా మా పెద్దల దగ్గరనుండి ఉంటున్నామని కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా నాపై పార్టీ కార్యాలయంపై కుట్రలు పన్నుతున్నారన్నారు. ఏవేవో సాకులు చెప్పి మమల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ బలంవంతంగా స్థలాన్ని కాళీ చెయించాలని పన్నాగాం పన్నారని ఆవేదన తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వారు దీనిపై దృష్టి సారించి పరిశీలించి అన్యాయం జరకుండా న్యాయం చేయాలని కోరారు.

## జాంపేట సెంటర్లో మజ్జిగ పంపిణీ



రాజమహేంద్రవరం : ప్రజాపాలన ప్రతినిధి:స్థానిక జాంపేట పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సహకారంతో జక్కంపూడి యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో బాటసారులకు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేసారు. ఆదివారం, సోమవారం సుమారు 210 లీటర్ల మజ్జిగను అందచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొంత శ్రీహరి, వైఎస్ఆర్సిపి నగర ప్రధాన కార్యదర్శి, 5వ డివిజన్ ఇన్చార్జ్ కుక్క తాతబ్బాయి చేతులమీదుగా మజ్జిగ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రూస్లీ, చిత్ర కళ, ఆశపు భద్రం, బాబ్జీ, మచ్చకర్ల రాజు, కోటి, శ్రీధర్ రెడ్డి, మురళీ, నోట్ల సత్యనారాయణ, బాబూరావు, ప్రసాద్, స్వామి, భద్రరావు, దుర్గ, పట్నాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేడ్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

| | |
|---|---|
| 12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ | Rs 5000/- |
| 13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, | Rs 5000/- |
| 14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ | Rs 2000/- |
| 15. రత్నశ్రీ పార్క్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ | Rs 2000/- |

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు
మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 19, ఏప్రిల్ 2022

# అలా జరిగి ఉండకపోతే..

ఆ రోజు ఆ సంఘటన జరిగి ఉండకపోతే... అసలు కథ మరోలా ఉండేదిరా అంటూ ఉంటాం. నిజ జీవితంలోనైనా, సాహిత్యంలోనైనా ఓ చిన్న ఘటనే అనుకోని మలుపైపోతుంది. అనూహ్య పరిణామాలకు దారి తీస్తుంది. యథార్థ జీవితంలోని ఘటనలను మనం సృష్టించలేం. అదే సాహిత్యంలో అయితే... ఇటువంటి మలుపులను రచయితలు చాలా తెలివిగా సృష్టిస్తారు. ఇక అక్కడి నుండి కథను ఎక్కడెక్కడికో తీసుకుపోతారు. ఆ ట్విస్టే అద్భుత రచనలకు ప్రత్యేక ఆకర్షణ అయిపోతుంది. అదే రచయితలోని చమత్కారాన్ని చాటి చెబుతుంది. మహాభారతాన్నే తీసుకోండి. పాండురాజు కుమారులు ప్రశాంతంగా తమ రాజ్యాన్ని తాము ఏలుకుంటూ సుఖంగా జీవిస్తోన్న తరుణంలో రచయిత వ్యాసుడి మెదడులో ఓ మెరుపులాంటి మలుపు తట్టింది. తాను సృష్టించిన పాత్రలతో ఓ కొత్త ఆట ఆడుకోవాలనిపించింది. అంతే ధర్మ రాజును జూదానికి ప్రేరేపించాడు. అది మామూలు ద్యూతం అయితే అనుకున్న ట్విస్ట్ రాదు కాబట్టి అధర్మ, మాయా ద్యూతాన్ని సృష్టించాడు. అందుకోసం శకునికి ఓ పెద్ద నేపథ్యం సృష్టించి, పాచికలు శకుని ఎలా చెబితే అలా ఆడేలా ప్లాన్ చేశాడు. ఆ రోజున శకుని మాయోపాయంతో కౌరవులు ధర్మరాజుని జూదానికి పిలవగానే జూదం అంటే మితిమీరిన ప్రేమ కలిగిన ధర్మరాజు మరో ఆలోచనే లేకుండా సై అన్నాడు. జూదం ఆడి శకుని మాయలో పడి రాజ్యాన్నీ, ధర్మపత్నినీ కూడా జూదంలో పోగొట్టుకున్నాడు. ఆ రోజు జూదం ఆడి ఉండకపోతే... పాండవులు అరణ్య వాసానికి వెళ్లాల్సి వచ్చేది కాదు... కౌరవులపై పాండవులకు కక్ష పుట్టేది కాదు... ఇద్దరి మధ్య కురుక్షేత్ర యుద్ధం జరగాల్సిన అవసరమూ ఉండేది కాదు! కేవలం జూదం కారణంగా లక్షలాది సైనికుల ప్రాణాలు తీసే యుద్ధం అనివార్యమైంది. ఆ తర్వాత పాండవులు, కౌరవుల్లో ఎవరూ మిగలకుండా అందరూ చనిపోవలసి వచ్చింది. ఇంత పెద్ద కథ రాసుకోవడం కోసం... వ్యాసుడు సృష్టించిన అద్భుతమైన ట్విస్టే%--% మాయా ద్యూతం. ఇదే లేకపోతే అసలు మహాభారతంలో మసాలాయే లేదు. 'తింటే గారెలు తినాలి... వింటే భారతం వినాలి' అని మనవాళ్ళు అని ఉండేవారు కారు. ఇటువంటి ట్విస్టే రామాయణంలో రచయిత వాల్మీకీ ప్రయోగించారు. అయితే వాల్మీకి రెండు మలుపులు పెట్టారు. కైకేయికి దశరథుడు ఏం కావాలంటే అది ఇస్తానని వరం ఇవ్వకుండా ఉంటే... రాముడు అరణ్యవాసానికి వెళ్లాల్సి వచ్చేది కాదు. సరే... అరణ్యానికి వెళ్లాడే అనుకుందాం. అక్కడైనా పధ్నాలుగేళ్ల పాటు అడవిలో సీతారామ లక్ష్మణులు ప్రశాంతంగా గడిపేసి, తిరిగి అయోధ్య వచ్చేయ వచ్చు. అందుకే వాల్మీకి అడవిలో పెద్ద ట్విస్ట్ పెట్టాడు. బంగారు లేడి కోసం రాముడు వెళ్లగానే, రాముడు ప్రమాదంలో ఉన్నాడనుకుని సీతమ్మ చెప్పిన వెంటనే లక్ష్మణుడూ వెళ్లాడు. వెళ్లే ముందు ఓ గీత గీసి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ గీత దాటద్దని షరతు విధించాడు. సీతమ్మ దానికి కట్టుబడి ఉంటే బాగుండేది. కానీ.. రావణుడు మారు వేషంలో వచ్చి సీతమ్మను గీత దాటేలా ప్రేరేపించడంతో లక్ష్మణుడి మాట పెడచెవిన పెట్టిన సీతమ్మ గీత దాటింది. అంతే... రావణుడు ఆమెను లంకకు ఎత్తుకుపోయాడు. సీతను రక్షించుకోవడం కోసమే రాముడు వానర సైన్యం సాయంతో సముద్రాన్ని దాటి, లంకలో రావణుడితో యుద్ధానికి దిగాల్సి వచ్చింది. సీతే కనక గీత దాటి ఉండకపోతే ఇంత కథ ఉండేది కాదు. వాల్మీకి సృష్టించిన ఈ ట్విస్టుతో రామాయణం నిత్య పారాయణమైంది. వ్యాసుడు, వాల్మీకే కాదు... యుగాల తరబడి గొప్ప గొప్ప రచయితలంతా కూడా తమ ఉద్గ్రంథాల్లో ఏదో ఓ చిన్న ట్విస్ట్ తో మొత్తం కథను నడుపుతారు. కథలోని ఆ కీలకమైన మలుపులే ఆ రచయితనూ, రచననూ కలకాలం గుర్తుండేలా చేస్తాయి. శకుంతలా దుష్యంతుల కథ అయిన 'అభిజ్ఞాన శాకుంతలం'లో మొత్తం మెలోడ్రామాకి ఉంగరమే పెద్ద ట్విస్ట్. దుష్యంతుడికి మతి మరుపు శాపం అనేది కథకు కొక్కెం. అందుకే ఆ కథ, ఆ నాటకం ఏ రూపంలో వచ్చినా అంత పెద్ద హిట్ అయ్యింది. ఇక యథార్థ జీవితంలోనూ ఇటువంటి మలుపులు లేకపోలేదు. ప్రపంచ చరిత్రలో జర్మనీ నియంత హిట్లర్ సోవియట్ రష్యా పైకి యుద్ధానికి కాలు దువ్వి ఉండకపోతే... జర్మనీ కథ మరోలా ఉండేది. సోవియట్ రష్యాకు సవాల్ విసరడం వల్లనే జర్మనీపై ప్రతీకారం తీర్చుకోవడానికి స్టాలిన్ యుద్ధానికి వెళ్లాడు. సోవియట్ ఆర్మీ చుట్టుముట్టడంతో తప్పించుకునే మార్గం లేక చివరకు హిట్లర్ ఆత్మహత్య చేసుకొని చనిపోవాల్సి వచ్చింది. సోవియట్ జోలికి వెళ్లకుండా ఉండి ఉంటే జర్మనీని మరికొన్నేళ్ల పాటు హిట్లర్ ప్రశాంతంగా ఏలుకుని ఉండేవాడేమో? ఈ స్క్రిప్ట్‌ను ఎవరూ రాయలేదు. దానంతట అది ఆవిర్భవించడంతో చరిత్రకారులు దాన్ని రాసుకున్నారు. బ్రిటిష్ వాడిని మొదట్లోనే అడ్డుకొని, 'ఎవర్రా నువ్వు? మా దేశంలోకి ఎందుకొచ్చావ్?' అని కాలర్ పట్టుకొని ఉంటే, భారతదేశం తెల్లవాడి పాలనలో బానిస బతుకు బతకాల్సి వచ్చేది కాదు. స్వాతంత్ర్య సంగ్రామం అవసరమయ్యేదీ కాదు. ఇది కూడా చరిత్ర సృష్టించిన ట్విస్ట్. ఇందులోని అసలు గొప్పతనం ఏమిటంటే... రచయితలు సృష్టించే మలుపులు చాలా సహజంగా ఉంటాయి. అవి నిజమే కాబోలు అనిపించేలా ఉంటాయి. అలా రాయడంలోనే వారి నైపుణ్యం కనపడుతుంది. మహారచయితలంతా కథాంశంలోని కీలకమైన మలుపులను ఆసరాగా చేసుకొన్నవారే! తమ రచనలను చిరస్మరణీయ గ్రంథాలుగా మలుచుకున్నవారే! కథల్లోని మలుపులతో ప్రపంచ సాహిత్యాన్నే మలుపు తిప్పిన రచయితలకు వందనాలు.

# మెలకువ రాత్రి



అలసట చెందిన కాయం
శయనమందిరానికి చేరినప్పటికి
ఆలోచనల జడి జ్ఞాపకాల తడిని
ఆరనివ్వట్లేదు..

నిద్ర కరుణించకపోయినా
మెలకువ భుజంపై చెయ్యేసి
నేనున్నా ఏం పర్లేదని ధైర్యాన్నిస్తోంది..

మరీ అంతగా గాకపోయినా
ఓ మోస్తరుగా వణికిస్తున్న చలిని
పారదోలడానికి
రేయి చీకటి దుప్పటిని తనపైకి
లాక్కొంటోంది..

చంద్రుడు చుక్కల మధ్య
కొలువుదీరి వెన్నెల మంత్రమేసి
విరహ వేదనను తట్టిలేపుతూ
నవ హృదయాల నడుమ చిచ్చు
రేపుతున్నాడు..

కాలం కన్నీరై కరిగిపోతున్నప్పటికి
చెదిరిన హృదయంలో
చెదరని స్వప్నం చెక్కుచెదరక
ఇంకా అలాగే నిలిచి ఉంది

రాత్రి క్రమంగా చుక్కల చూరును
పట్టుకుని
మెల్లిగా కిందికి కారిపోతోంది..
ఉదయం రేయిని మింగడానికి
రాహువై సమీపిస్తోంది..

సాకారం కాని స్వప్నం
ఆకారం దాల్చని అభిలాషని
పదిలంగా పట్టుకున్నందున
నిద్ర దరికి చేరక దూరపు కొండల్లోకి
దూరిపోయింది

- సర్ఫరాజ్ అన్వర్

# ఆలస్యమే! అయినా అభిలషణీయమే!



సీపీఎం తన అత్యున్నత నిర్ణాయక విభాగమైన పొలిట్ బ్యూరోలోకి ఎట్టకేలకు ఒక దళితుడిని చేర్చుకుంది. ఒక దళిత నాయకుడికి ఆ స్థానం కట్టబెట్టడానికి భారతదేశంలోని అతిపెద్ద వామపక్ష రాజకీయ పార్టీకి 57 సంవత్సరాల సుదీర్ఘ సమయం పట్టింది. బెంగాల్ నుంచి ఏడుసార్లు ఎంపీగా గెలిచిన రామచంద్ర డోమ్‌ను సీపీఎం ఇటీవలే నిర్వహించిన పార్టీ జాతీయ మహాసభలలో పొలిట్ బ్యూరోలోకి తీసుకుంది. ఇది స్వాగతించదగిన పరిణామం. అయితే ఒక దళిత నాయకుడిని పొలిట్ బ్యూరోలోకి తీసుకున్నంత మాత్రాన పెద్ద మార్పు జరిగిపోదని గ్రహించాలి. ఎందుకంటే భారతదేశంలో వామపక్షం కులవివక్షపై నేటికీ స్పష్టమైన వైఖరిని కలిగిలేదు. వామపక్ష పార్టీలు వర్గ వివక్షను అర్థం చేసుకున్నాయి కానీ కులాన్ని కాదు. 'ఒక కమ్యూనిస్టుగా పొలిట్ బ్యూరోలో స్థానం సంపాదించుకున్న మొట్ట మొదటి దళితుడిగా నాకు నేనుగా భావించలేను. మరే విషయంలోనైనా సరే అలాంటి ఆలోచనలు నాకు ఉండవు' అని రామచంద్ర డోమ్ మీడియాతో చెప్పారు. భారతీయ నేపథ్యంలో ఈ ప్రకటన కూడా సమస్యాత్మకమే. పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టులు సుదీర్ఘ కాలం పాలించినా కానీ దళితులకు లేదా ఆదివాసీలకు కీలకమైన నాయకత్వ స్థానాల్లో చోటు కల్పించలేక పోయారు. జ్యోతిబసు, బుద్ధదేవ్ భట్టాచార్య, సీతారామ్ ఏచూరి, మాణిక్ సర్కార్ తదితర సీపీఎం అగ్ర నేతలు అందరూ అగ్రకుల నేపథ్యాల నుంచి వచ్చారు. వామపక్షంలో బయటకు కన్పించని, లేదా మాట్లాడని కులపక్షపాతం చాలా ప్రమాదకరమైనది. దేశంలోని పలు రాష్ట్రాల్లో వామపక్షాలు తమ రాజకీయ ప్రాధాన్యాన్ని కోల్పోవడం వెనుక ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటని చెప్పవచ్చు. పశ్చిమ బెంగాల్‌లో దళిత ఓట్లు గతంలో కమ్యూనిస్టు పార్టీకే పడేవి కానీ తర్వాత వాటిని తృణమూల్ కాంగ్రెస్ చేజిక్కించుకుంది. ఇప్పుడు దళితుల ఓట్లు బీజేపీ వైపు మళ్లాయి. బెంగాల్‌లో మాదిరి త్రిపురను కూడా సీపీఎం 25 ఏళ్లు పాలించింది. కానీ ఈరోజు ఆ రాష్ట్రాన్ని కూడా బీజేపీ స్వాధీనపర్చుకుంది. రాష్ట్రంలోని ఆదివాసీ రాజకీయాలను గుర్తించడంలో కమ్యూనిస్టుల వైఫల్యమే ఈ పతనానికి కారణం. కేంద్రీకృత నిర్ణయాలు అందరికీ సమానంగా వర్తించాలని సీపీఎం నమ్ముతుంది కానీ గిరిజనులకు అవసరమైన రాజకీయ ఆవరణను వీరు అనుమతించలేక పోయారు. ఈ రాజకీయ శూన్యతలోకి ఆరెస్సెస్ అడుగుపెట్టి గిరిజనులకు ఒక వేదికను కల్పించింది. క్రమంగా త్రిపురలో గిరిజనుల ఓట్లు బీజేపీ వైపు మళ్లాయి. చివరకు ఆ పార్టీ గెలుపు సాధించింది కూడా! 2018లో తెలంగాణలో దళిత రాజకీయ పార్టీలతో సీపీఎం చేతులు కలిపి బహుజన వామపక్ష ఐక్య సంఘటనను ఏర్పర్చింది. తెలంగాణలో సీపీఎం నాయకత్వం జై భీమ్ - లాల్ సలాం అనే నినాదాన్ని కూడా చేపట్టింది. అంబేడ్కర్ని కమ్యూనిస్టులు తమ రాజకీయాల్లో మొట్టమొదటిసారిగా గుర్తించిన సమయమిది. అయితే ఈ ప్రయత్నం కూడా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారంలాగే ఉండిపోయింది తప్పితే దళితులకు, గిరిజనులకు వారి పొలిట్ బ్యూరోలో ఎన్నడూ స్థానం కల్పించలేదు. పైగా దళిత రాజకీయాలను గుర్తింపు రాజకీయాలుగా మాత్రమే వామపక్షం పిలుస్తూ వచ్చింది. అంబేడ్కర్ రాసిన 'కుల నిర్మూలన' పుస్తకాన్ని వామపక్షం ఎన్నడూ అంగీకరించలేదు. తమ పొలిట్ బ్యూరోలోకి మొట్టమొదటి దళిత నేతను చేర్చుకోవడాన్ని వ్యూహాత్మక అడుగుగా వామపక్షం ఎన్నటికీ ఆమోదించదు. అయినప్పటికీ ఇది వాస్తవం. తమ రాజకీయ అవకాశాలు ఎన్నడూ లేనంతగా కుదించుకు పోతున్నాయని వామపక్షం కొన్ని సంవత్సరాలుగా గుర్తిస్తూ వస్తోంది. త్రిపుర, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో వామపక్షాలకు సంబంధించిన క్షేత్రస్థాయి సంస్థలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. కింది స్థాయిలో సంస్థను బలోపేతం చేసుకోవడానికి ఏకైక మార్గం మరింతగా ప్రజారాశులను చేర్చుకోవడమే అని వామపక్ష నాయకత్వం గుర్తించింది. 57 సంవత్సరాల తర్వాత పార్టీ నిర్ణాయక అంగమైన పొలిట్ బ్యూరోలో దళిత, గిరిజన నేతలను చేర్చుకోవడం అనేది సంస్థాగత మార్పులను తీసుకొస్తుందని వామపక్షం గుర్తించింది. భారతదేశంలో వామపక్ష పునరుద్ధరణ సాధ్యపడుతుందా అనే ప్రశ్నకు సమాధానం అవుననే చెప్పాలి. కానీ కుల వివక్ష, మైనారిటీల పట్ల వివక్ష ఉందన్న వాస్తవాన్ని ఆమోదించకుండా, వారి స్వరాలకు చోటు కల్పించకుండా వామపక్ష పునరుద్ధరణ అసంభవం. సాంప్రదాయికంగా తాము విశ్వసిస్తూ వచ్చిన రాజకీయ పార్టీల నుంచి ముస్లింలు కూడా బయటపడుతూ తృణమూల్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి కొత్త పార్టీలకు లేదా ఏఐఎంఐఎం వంటి పార్టీలకు ఓటు వేస్తున్నారు. భారతీయ కులాధిక్యతా సమాజంలో మార్క్సిజాన్ని తప్పుగా అన్వయించడం వల్లే వామపక్షం తనదైన చోటును కోల్పోయింది. తన పొలిట్ బ్యూరోలోకి తొలి దళితుడిని సీపీఎం చేర్చుకోవడం అనేది రాబోయే రోజుల్లో నిజమైన మార్పును తీసుకొస్తుంది. భారత రాజకీయాల్లో తమ పునరుద్ధరణకు తొలి అడుగుగా వామపక్షం దీన్ని గుర్తించాల్సి ఉంటుంది.

# వ్యవస్థల్లో విపరీత ధోరణులు

ప్రజలు ఎన్నుకొనే ప్రభుత్వాలకు రాజకీయపరమైన నిర్ణయాలు చేయగల హక్కు ఉన్నప్పుడు, వాటి పరిష్కారానికి ప్రజలు ఎన్నుకున్న శాసన వేదికలకు నివేదించకుండా సుప్రీంకోర్టు వైపు ఎందుకు చూస్తున్నట్టు.. అని ఇటీవల సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ నేపథ్యంలోనే.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.. రాష్ట్ర రాజధాని సమస్యపై అసెంబ్లీ సాక్షిగా తీసుకున్న నిర్ణయాల్ని తప్పుపడుతూ 'రాజధానిని మార్చే హక్కు ఏపీ ప్రభుత్వానికి లేదని' ప్రకటించడం న్యాయసమ్మతమేనా అనే ప్రశ్నకు గౌరవప్రదమైన సమాధానం రావలసి ఉంది. మరోవైపు.. న్యాయస్థానాల్ని ఇరకాటంలోకి నెట్టి తమాషా చూడగల 'రాజకీయ పక్షుల' చేతుల్లో రాజ్యాంగ వ్యవస్థలు ఆటవస్తువులుగా మిగిలిపోతున్నాయన్నది వర్తమాన చరిత్ర. ఈ సరికొత్త వినాశకర ధోరణే దేశంలోనూ, రాష్ట్రాలలోనూ రాజ్యాంగ నిర్మాతలు విస్పష్టంగా నిర్దేశించిన నియమ నిబంధనలు ఒక్కొక్కటిగా కూలిపోతూండటానికి తార్కాణమని గమనించాలి. వెనకటికి పల్నాటి నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడితో పోరు సందర్భంగా 'నీ మూతికి మీసాలుంటే నా ముంజేతికి వెంట్రుకలున్నవి తెలుసా' అని ఎద్దేవా చేసిందట. నేడు దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు కూడా పరస్పరం 'నీవెంతంటే, నీవెంత' అన్నట్టు కుమ్ములాడుకుంటున్నాయి. సుప్రీంకోర్టు గౌరవ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ తన అధ్యక్షతన సమావేశమైన ప్రత్యేక బెంచ్‌లో (8.4.2022) మాట్లాడుతూ, ప్రభుత్వ పాలనా వ్యవస్థ న్యాయమూర్తులను ఆడిపోసుకుంటూ ఉండటం కొత్తగా బయల్దేరిన ధోరణి అనీ, ఇది 'అత్యంత దురదృష్టకర పరిణామ'మనీ వ్యాఖ్యా నించారు. అందునా, అవినీతి నిరోధక చట్టం కింద, ప్రజా ప్రయో జనాల రక్షణ చట్టం కింద కోర్టు ముందుకు విచారణ కోసం వచ్చే ప్రస్తావనలను న్యాయస్థానం పరిశీలించాల్సి ఉంటుంది. ప్రజలు ఎన్నుకొనే ప్రభుత్వాలకు రాజకీయపరమైన నిర్ణయాలు చేయగల హక్కు ఉన్నప్పుడు, వాటి పరిష్కారానికి ప్రజలు ఎన్నుకున్న శాసన వేదికలకు నివేదించకుండా సుప్రీంకోర్టు వైపు ఎందుకు చూస్తున్నట్టు? అలాంటి పరిస్థితుల్లో అన్ని సమస్యల్ని కోర్టే పరిష్క రించాల్సి వస్తే, శాసన వేదికలు (పార్లమెంటు/రాష్ట్రాల శాసన సభ/శాసనమండలి) ఉన్నదెందుకు అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమణ సకాలంలో సంధించగలిగారు. అయితే ఇదే సమయంలో, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కొత్తగా నియమితులైన ప్రధాన న్యాయమూర్తి రాజ్యాంగబద్ధంగా, అఖండ మెజారిటీతో ప్రజలు ఎన్నుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా రాష్ట్ర రాజధాని సమస్యపై అసెంబ్లీ సాక్షిగా తీసుకున్న నిర్ణయాల్ని తారుమారు చేస్తూ 'రాజధానిని మార్చే హక్కు ఏపీ ప్రభుత్వానికి లేదని' ప్రకటించడం న్యాయ సమ్మతమైనదా? అన్న ప్రశ్నకు గౌరవప్రదమైన సమాధానం రావలసే ఉంది.

**సరికొత్త వినాశకర ధోరణి!**

నిజానికి న్యాయమూర్తులపై 'ప్రభుత్వాలే దుష్ప్రచారం ప్రారంభిం చడం దురదృష్టకరమన్న' జస్టిస్ రమణ విమర్శ సబబైనది. ఈ సరికొత్త దుష్ప్రచారానికి తెరతీసిన వాళ్లు కూడా కేంద్ర పాలకులేనన్నది మరచిపోరాదు. కోర్టుల్ని ఇరకాటంలోకి నెట్టి తమాషా చూడగల పాలకులు, ప్రభుత్వాలు ఉన్నచోట... పార్లమెంట్‌లు, శాసనసభ వేది కలు, న్యాయవ్యవస్థలు అధికార స్థానాల్లో ఉన్న 'రాజకీయ పక్షుల' చేతుల్లో ఆటవస్తువులుగా మిగిలిపోతున్నాయన్నది వర్తమాన చరిత్ర. ఈ సరికొత్త వినాశకర ధోరణే దేశంలోనూ, రాష్ట్రాలలోనూ రాజ్యాంగ నిర్మాతలు విస్పష్టంగా నిర్దేశించిపోయిన లిఖితపూర్వక నియమ నిబం ధనలు ఒక్కొక్కటిగా కూలిపోతూ ఉండటానికి తార్కాణమని గమ నించాలి. ఈ ధోరణిలో భాగమే పాలకులు ఉత్తర-దక్షిణ భారతాల మధ్య విభేదాల గండికొట్టి శాశ్వత శత్రుత్వాన్ని నర్మగర్భంగా పెంచి పోషిస్తూ రావడం! ఉత్తరప్రదేశ్‌కు చెందిన 80 పార్లమెంట్ స్థానాలను ముందు కాంగ్రెస్, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీఆరెస్సెస్ కూటమి గట్టిగా నిలుపుకొంటూ వస్తున్నాయి. పార్టీలకు లభిస్తున్న ఈ 'ప్రాణ దానం'లో మెట్టు వాటా ఎన్నికల సమయాల్లోనూ, ఆ పిమ్మట రాజ కీయ అధికారాన్ని నిలబెట్టుకోడానికి కార్పొరేట్ డొనేషన్లు కీలక పాత్ర వహిస్తూన్నాయి. 201920 నాటి లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు కార్పొరేట్ డొనేషన్ల రూపంలో 'విరాళాల' ముసుగులో ఐదు జాతీయ పార్టీలకు అందిన మొత్తం రూ. 920 కోట్లని 'ప్రజాస్వామ్య సంస్కరణల పరిరక్షణా సంస్థ' సాధికార పరిశోధనా పత్రం బయట పెట్టింది. ఆ పార్టీలు: బీజేపీ, కాంగ్రెస్, ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్, మార్క్సిస్టు పార్టీలు. బీజేపీ 2020 నుంచీ భారీ స్థాయిలో కార్పొరేట్ డొనేషన్ల 'రుచి' మరిగిన పార్టీగా పరిగణనలోకి వచ్చింది. ఆ పార్టీకి అత్యంత అధిక 'విరాళాలు' సమకూర్చే పెద్ద కార్పొరేట్ సంస్థ 'ప్రూడెంట్ ఎలొక్టరల్ ట్రస్ట్'! ఇదే కాంగ్రెస్‌నూ సాకుతోంది. ఇవిగాక దొంగచాటుగా పార్టీల కరప్షన్‌కు తోడ్పడేవి మరికొన్ని సంస్థలూ!

ఇలాంటి సందర్భాలలోనే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ సూటిగా పై ప్రశ్నను రాజకీయులకు సంధించాల్సి వచ్చిం దనుకోవాలి. 'ప్రజాప్రయోజన వ్యాజ్యాలను న్యాయస్థానాలు విచా రణకు స్వీకరించాల్సి వస్తే ఇక ప్రజలు ప్రభుత్వాన్ని ఎందుకు ఎన్ను కున్నట్టో, చట్టాలు చేసే పేరుతో శాసన వేదికలు ఉన్నదెందుకో...' చెప్పాలన్న ప్రశ్నకు ప్రస్తుత పార్లమెంట్‌గానీ, పలు శాసన వేదికలు గానీ సమాధానాలతో స్పందించి తీరాలి. కానీ ఆ సంకల్పం ఎక్కడా ఇప్పుడు జరుగుతున్న 'అమృత మహోత్సవాల' సంబరాల ముంగిట కానరావడం లేదు.

**తక్షణ విచారణకు నివేదిక**

ఆ మాటకొస్తే నేడు జరుపుకుంటున్నది 'అమృత మహోత్స'వాలేనా, అప్పుడే 75 సంవత్సరాలు మనకు తెలియకుండానే వృథా అయి పోయాయా అన్న ఆశ్చర్యమే మిగులుతుంది. అమృత మహోత్సవం అన్న పదం వినబడుతున్న సమయంలోనే దేశ రాజకీయ వేత్తలపై గత ఐదేళ్లకు పైగా నానుతూ వస్తున్న 2,000 అవినీతి కేసులను ముందు తక్షణం విచారించి శిక్షించాలని కోరుతూ జస్టిస్ రమణ అధ్యక్షతన ఉన్న బెంచ్ ముందుకు వచ్చింది. ఈ శిక్షను వెంటనే విధిగా డిమాండ్ చేసిన వ్యక్తి ఎవరో కాదు, సాక్షాత్తూ సుప్రీం సీనియర్ న్యాయవాది, సుప్రీంకు న్యాయ సలహాదారుగా ఉన్న (ఎమికస్ క్యూరే) విజయ్ హన్సారియా. అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా... దేశంలో గత ఐదేళ్లుగా పెండింగ్‌లో పడిపోయిన అవినీతి కేసులకు సంబంధించిన 16వ నివేదికను కూడా ఆయన త్వరలో సమర్పించనున్నారు. ఆ ధర్మా సనంలో జస్టిస్ కృష్ణ మురారి, ముక్కుసూటి మనిషి హిమాకోహ్లీ కూడా ఉండబోవడం విశేషం. పెండింగులో ఉన్న అవినీతి కేసులు ఎదుర్కొంటున్న వారిలో మాజీ శాసనకర్తలే (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు)గాక ప్రస్తుతం కొనసాగుతున్న శాసన కర్తలు కూడా ఉండటం విశేషం! పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీ, శాసనమండలి సభ్యులపై మొత్తం 4,984 కేసులుండగా, వాటిల్లో 1,899 కేసులు ఐదేళ్లకు పైగా నానుతున్నాయి. 2018 నాటికి నమోదై ఉన్న కేసులు 4,110 కాగా, అవి 2020 అక్టోబర్ నాటికి 4,859 దాకా పెరిగి పోయాయి.

**ప్రశ్నలోనే ఉందా సమాధానం?!**

పార్లమెంట్‌కు, రాష్ట్రాల శాసన వేదికలకు నేర చరిత్ర గలవాళ్లూ పార్టీల తరఫున ఎన్నికవుతున్నారని, సాధికార నివేదికలు తెల్పుతున్నందువల్ల ఇక జాప్యం చేయరాదని ఎమికస్ క్యూరే హన్సారియా సుప్రీంకు ఇలా తాజాగా నివేదించడం ఆసక్తికరం! ఎందుకంటే, త్యాగరాజు 'నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా' అని ప్రశ్నించుకోవడంలోనే తెలివైన సమాధానం ఉంది. 'నిధి' సుఖమనుకున్నవారు, ధన సుఖం చూసుకునేవారు, జన సుఖానికి చెల్లుచీటీ ఇస్తారు. ఒక సామెత ఉంది 'న్యాయం చెప్పవయ్యా నాగిరెడ్డీ అంటే, నాకూ ఇద్దరు పెళ్లాలే, ఏం చెప్పేది' అన్నాడట! ఈనాటి పరిస్థితులూ ఇందుకు భిన్నంగా లేవంటే బాధపడీ లాభం లేదు. ఈ సందర్భంలో ఎందుకనో దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆశావహమైన మాటలు గుర్తుకొస్తున్నాయి: "మంచో చెడో నువ్వు ఎవరితో పోతావు అని నన్నడిగితే, గోతిలోనికి తీసుకుపోయినా యువజనంతోనే పోతాను అంటాను. మనిషి నిత్యపథికుడు. అందుకే శీతవేళ రానీయకు/ శిశిరానికి చోటీయకు/ పూలకారు ఏనాటికీ పోనీయకు"!!

# పుంజుకున్న సైకిల్ జోరు



నందిగామ ఏప్రిల్ 18 ప్రజాపాలన ప్రతినిధి: తెలు గు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్ర బాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ తెలుగు యువత రాష్ట్ర అధ్య క్షులు డాక్టర్ పొగాకు జయరాం హైదరాబాదు నుండి అమరావతి వరకు ప్రారంభించిన సైకిల్ యాత్రకు సో మవారం నాడు మధ్యాహ్నం అనాసాగరం బైపాస్ వ ద్ద తెదేపా శ్రేణులతోమాజీ శాసనసభ్యురాలు తంగి రాల సౌమ్య కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కా ర్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చినట్టు మ్మాజీ శా సన సభ్యురాలు సౌమ్య తెలిపారు జనసమీకరణ కూ డా అనూహ్యంగా పెరిగి కార్లతో ర్యాలీ లో పాల్గొన్నా రు దీన్ని చూస్తే సైకిల్ జోరు కాస్త జోరు కాస్త పుం జు కున్నట్టుగా అనిపిస్తుంది

# స్పందనలో స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలోనే పరిష్కరించాలి: కలెక్టర్ డా. కె.మాధవీలత



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం లో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. మాధవీలత మాట్లాడుతూ, ఈ వారం సుమారు 140 పైగా స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదులను అందచేసార న్నారు. పెన్షన్స్, భూమి సంబంధ అంశాలు, ఇండ్ల స్థలాలు, సరిహద్దులు, రేషన్ కార్డులు, ఇసుక, గృహ నిర్మాణం, తదితర వాటి కోసం సమస్య పరిష్కారం కొరకు దరఖాస్తు లను అందచేశారు. జిల్లా లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలు వారికీ సంబందించిన కార్యకలాపాలు ప్రారంభించాల న్నారు. అత్యవసరం అయిన ఫైల్స్ తప్ప మిగిలిన అన్ని ఉత్తర ప్రత్యుత్తర ఫైల్స్ అన్ని ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదు ల పరిష్కారం ప్రభుత్వ మార్గదర్శకాలకి లోబడి పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు స్పందన లో వస్తున్న అర్జీలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ పరస్ప రం చర్చించి సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**స్పందన కు ప్రత్యేక ఏర్పాట్లు :** ఆర్టీసీ బస్టాండ్, సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రత్యేక ఉచిత బస్సు సర్వీసు కలెక్టరేట్ ఆవరణలో అర్జీ దారులు కోసం టెంట్, త్రాగు నీరు ఏర్పాటు స్పందన కు వొచ్చిన ఫిర్యాదు నమోదు కోసం సెల్ ఏర్పాటు ఈ స్పందన కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ సి హెచ్. శ్రీధర్, డీఆర్వో ఏ. సుబ్బారావు, ఆర్డివోలు ఎస్. మల్లిబాబు, ఏ. చైత్ర వర్షిణి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు



చందర్లపాడు ఏప్రిల్ 18 ప్రజా పాలన ప్రతినిధి:మం డలపరిధిలో గుడిమెట్ల గ్రామం లో అంగవాడి కేంద్రా న్ని సందర్శించి చిన్నారులకు ఇచ్చే ఆహారాన్ని, త్రాగు నీ టిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉం చాలని ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం చిన్నా రులకు ఆహారాన్ని అందించాలని అంగన్వాడి సహా యకురాలుకు తగుసూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో లో అంగన్వాడీ సిబ్బంది పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# నన్నయ యూనివర్సిటీ నేక్ గ్రేడ్ సాధించాలి

## గౌరవ అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలోనే పెద్ద యూనివర్సిటీగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం నేక్లో మంచి గ్రేడ్ సాధించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ అఫీలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. నన్నయ యూనివర్సిటీ బాగా అభివృద్ధి చెందితే అది రాజమహేంద్రవరానికి కూడా మంచి భవిష్యత్తుని ఇస్తుందన్నారు. స్థానిక రాజమహేంద్రి డిగ్రీ, పిజి కళాశాలలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 420 కళాశాలలు నన్నయ యూనివర్సిటీకి అను స్టాఫ్ ఎవరైనా మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లి కఠిన చర్యలు బంధంగా పనిచేస్తున్నాయన్నారు. నేక్ మంచి గ్రేడ్ సాధించాలంటే ప్రజలందరూ తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని కోరారు. తమ మేనేజ్మెంట్ అసోసియేషన్ ను పునర్నిర్మాణం చేస్తున్నామని మూడు జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. విసి మొక్కా జగన్నాధరావు నిత్యం యూనివర్సిటీని అభివృద్ధి మూడు జిల్లాల నుంచి ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సంయుక్త కార్యదర్శుల్ని నియమించడం ద్వారా ప్రతీ జిల్లాలో ఇద్దరు ఆన్లైన్ ద్వారా క్లాసులు నిర్వహించడం జరిగిందన్నారు. ఆఫీస్ బేరర్లు ఉండేలా చేసామని వివరించారు. నన్నయకు ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడంతో పాటు ఇంజనీరింగ్ కళాశాలకు ఎఐసిటిఇ గుర్తింపు కూడా వచ్చిందన్నారు. ఇప్పుడు నేక్ లో మంచి గ్రేడ్ వస్తే బంధ కళాశాలలన్నీ ఖచ్చితంగా నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన నన్నయ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కూడా భారీగా వస్తాయని, విద్యను అందించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కళాశాలల వాటి ద్వారా యూనివర్సిటీ మరింతగా అభివృద్ధి పొందేందుకు అభివృద్ధికి కూడా విసి పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారన్నారు. ఈ అవకాశం ఏర్పడుతుందన్నారు. అన్ని అనుబంధ కళాశాలల్లో సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చదువుతున్న విద్యార్థులు, పనిచేస్తున్న అధ్యాపకులు, నాన్ టీచింగ్ ఉపాధ్యక్షుడు బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు. తీసుకునేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. మద్యం సేవించి కళాశాలలకు వస్తే వారికి టిసి ఇచ్చి పంపేస్తామని, ఉద్యోగులను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసేలా చర్యలు ఉంటాయ చేసేందుకు కృషి చేస్తున్నారని, కరోనా సమయంలో నిపుణులతో అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ నేక్ మంచి గ్రేడ్ వస్తే యూనివర్సిటీ ప్రతిష్ట పెరుగుతుందన్నారు.

# పిన్నమనేని కోటేశ్వరరావు కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వెంకయ్య నాయుడుతో సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట ఏప్రిల్ 18 ప్రజాపాలన ప్రతినిధి:జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎన్నో ఏళ్ళు విశిష్ట సేవలందించిన స్వర్గీయ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు నేటి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడుతోఅంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్ర భు త్వవిప్ జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభస భ్యు లు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలోజిల్లా అధికారులు,జిల్లాలోని ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



కంచికచర్ల ఏప్రిల్ 18ప్రజాపాలనప్రతినిధి:ఇటీవల కాలంలో అప్పుల బాధ తాళలేక పెండ్యాల గ్రామానికి చెందిన జ్వాలా నరసింహారావు కుటుంబాన్ని మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు తో కలిసి సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ సం దర్భంగా మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గొప్ప లు చెప్పుకోవడం తప్ప రైతులకు చేసినది ఏమిలేదని తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతు లు ఒకపక్క ఆత్మహత్యలు చేసుకుంటుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఈ విషయాలు పట్టవా అని సౌమ్య తీవ్రంగా విమర్శించారు. ఈ కుటుంబానికి అన్ని వి ధాలా తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని సౌమ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మై నార్టీ నాయకులు ఎండి అల్లిపాషా నాయకులు షబ్బీ ర్ తదితరులు దేశ నాయకులు పాల్గొన్నారు

# విజ్ఞాన్స్‌లో ఘనంగా ప్రారంభమైన జాతీయస్థాయి ట్రైనింగ్ ప్రోగ్రామ్




పొన్నూరు ఏప్రిల్ 18(ప్రజా పాలన ప్రతినిధి) :చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ సంయుక్త సహకారంతో డీఎస్టీ స్పాన్సర్డ్ నేషనల్ లెవల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను వారం రోజుల పాటు నిర్వహిస్తున్నామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " వైబ్రేషన్ బేస్డ్ ప్రొడక్టర్ క్వాలిటీ అండ్ కండీషన్ మోనిటరింగ్ సిస్టమ్స్ ఇన్ అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎస్‌టీయూటీఐ ప్రోగ్రామ్-2021" అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గీతం యూనివర్సిటీ ఎస్‌టీయూటీఐ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బల్లా శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ వైబ్రేషన్ లెవల్ ఆధారిత ఎక్విప్‌మెంట్‌లో పట్టు సాధించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కండీషన్ మోనిటరింగ్ సిస్టమ్స్ ఇన్ అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో పరిశోధనలు చేయడానికి విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు పదునుగా ఉండాలన్నారు. సాంకేతికత పరవళ్లు తొక్కుతున్న తరుణంలో విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధనా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు కొత్త కొత్త పరిజ్ఞానాలతో అన్ని రంగాలకు ఉపయోగపడే పరికరాలను తయారుచేయాలని సూచించారు. నేర్చుకున్న పాఠాలను ప్రయోగాలుగా మలిచే సామర్థ్యాలను విద్యార్థులు పెంచుకోవాలని చెప్పారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బల్లా శ్రీనివాస ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.

# ఘనంగా వాసవి సేవాదళ్ మహిళ విభాగ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



కారంపూడి...ఏప్రిల్18...ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణం లో సత్యసాయిబాబా కళ్యాణ మండపం లో వైభవంగా వాసవి సేవాదళ్ మహిళా విభాగం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాదు. ప్రతాప్, మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్ వెల్ఫేర్ రీజియన్ చైర్మన్ వందన పద్మ పాల్గొని సభను ఉద్దేశించి ఆర్యవైశ్యులు సేవ చేస్తూ మంచి గుర్తింపు పొందాలని కరోనా టైంలో కూడా ఆర్య వైశ్యులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేయడం జరిగిందని నూతన కమిటీని సేవాదళ్ మహిళా విభాగ్ కమిటీ అధ్యక్షురాలు గుండా. నాగమల్లేశ్వరి ప్రధాన కార్యదర్శి చిన్ని. లక్ష్మి కోశాధికారి మాడిశెట్టి. పుష్పలత గౌరవాధ్యక్షురాలు ఏచూరి. విజయలక్ష్మి కన్వీనర్ బవిరి శెట్టి. సీతామహాలక్ష్మి మరియు 80 మంది కమిటీ సభ్యులను జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కజ్జాయం. విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గోంట్ల. కోమలి మరియు రజిని కమిటీ సభ్యులు అందరి చేత ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భం లో భాగంగా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాదు ప్రతాప్ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు వచ్చిన అతిథులకు దృశ్యాలతో సన్మానించి మెమెంటో ను అందజేశారు ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బవిరిశెట్టి .రామారావు ప్రధాన కార్యదర్శి గుండా. ఉమామహేశ్వరరావు ఉపాధ్యక్షులు చలువాది. మాధవ్ సన్నిధి. జగన్ మోహన్ రావు గుంటూరు అర్బన్ యూత్ నాయకులు మైలవరపు. ప్రవీణ్ ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు కజ్జ0. అరుణ మరియు చలివేంద్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి: సివిల్ జడ్జి ఎం సత్య కుమారి



పొన్నూరు ఏప్రిల్18( ప్రజా పాలన ప్రతినిధి) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి. వారి ఆదేశాల మేరకు 26.06.2022 న పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం సత్య కుమారి పేర్కొన్నారు. పొన్నూరు కోర్టుల ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నందు రాజీపడి తగిన క్రిమినల్ కేసులు ,సివిల్ కేసులు ,చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల కేసులు మరియు ఫ్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చు అన్నారు. కక్షిదారులు వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోవలసినది గా ఆమె కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు ప్రత్యక్షముగా హాజరు కావచ్చునని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నంబర్:9492662537 లేదా మెయిల్ ఐడి:pnrmisc@yahoo.com నందు సంప్రదించవలసినదిగా ఆమె కోరారు.

# రాష్ట్ర హోం మంత్రిని కలిసిన నూర్ భాషా అల్లాబక్షు



పొన్నూరు ఏప్రిల్ 18(ప్రజా పాలన ప్రతినిధి) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ను పొన్నూరు ప్రాంతానికి చెందిన స్టీఫెన్ హాకింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూర్ భాషా అల్లాబక్షు మర్యాదపూర్వకంగా మంత్రి ఛాంబర్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర హోంమంత్రిగా మళ్లీ మహిళను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు. హోంమంత్రిని కలిసినవారిలో దివ్యాంగుల నేతలతోపాటు నిరుద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ , డి. శ్రీనివాసులు, తిరుపతి నాగరాజు తదితరులు ఉన్నారు.

# రెడ్ క్రాస్ కు రెండు లక్షల విరాళం



కావలి ఏప్రిల్ 18 ప్రజాపాలన ప్రతినిధి :కావలి రెడ్ క్రాస్ లోని రక్తనిధి కేంద్రంలో కాంపోనెంట్ బ్లాక్ ఏర్పాటుకు ప్రవాస భారతీయుడు దొడ్ల కృష్ణకిషోర్ రెడ్డి రూ.2లక్షల విరాళం అందించారు సోమవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా రెండు లక్షల రూపాయల విరాళ చెక్కును ఆయన అందించారు. కృష్ణకిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలధర్మం చెందిన తన తండ్రి దొడ్ల భాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ విరాళం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విరాళదాత దొడ్ల కృష్ణకిషోర్ రెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బాధ్యులు రవిప్రకాష్ , సుధీర్ నాయుడు,ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, బి యస్ ప్రసాద్ , కావలి జడ్పిటీసి జంపాని రాఘవులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో పెయింటింగ్ కార్మికుడు మృతి: సంతాపం తెలిపిన ఏఐటీయూసీ



పొన్నూరు ఏప్రిల్18( ప్రజా పాలన ప్రతినిధి) పొన్నూరు పట్టణం శాంతినగర్ 20వ వార్డు కు చెందిన పెయింటింగ్ కార్మికుడు చల్లా ఏడుకొండలు గత ఆదివారం విజయవాడ నుండి ద్విచక్రవాహనం పై పొన్నూరు వస్తుండగా వెనక నుంచి అతి వేగంగా లారీ ఢీకొనడంతో ఏడుకొండలు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఏఐటీయూసీ నాయకులు ఏడుకొండలు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చనిపోయిన ఏడుకొండలు కుటుంబానికి ఏ ఐ టి యు సి యూనియన్ తరఫున 25 వేలు నగదు అందజేశారు. పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎబినేజర్ బాబు , గౌరవ అధ్యక్షులు డి మాణిక్యరావు, పాండురంగారావు, పెయింటింగ్ షాప్ యజమాని సాదిక్ తదితర పెయిటింగ్ కార్మికులు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఆర్టీసీ ఛార్జీల పెంపుతో పేద, మధ్యతరగతి వర్గాలపై భారం: గోగులమూడి రాజు



పెనవంలవారం ప్రజాపాలన ప్రతినిధి : ఈ రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటం ఆడుతోందని రాష్ట్ర ప్రభుత్వం తన అసమర్థత పాలనతో పేదలపై చెత్త పన్ను ఆస్తి పన్ను ఇలా పలు రకాల పన్నులు వేస్తూ విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచుతూ ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని పీవీ రావు మాల మహానాడు కృష్ణా జిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు ధ్వజమెత్తారు.సోమవారం స్థానిక మాల మహానాడు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పన్నులు పెంచటమె ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయిందని విమర్శించారు రాష్ట్రంలో తాజాగా ఆర్టీసీ బస్ టికెట్లు రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకోవటం సరైనది కాదన్నారు. ఇప్పటికే కరెంటు, చెత్త, ఆస్తి పన్నులు తో పాటు నిత్యవసర వస్తువుల ధరలతో ప్రజలు అల్లాడుతున్నారుఅని అన్నారు . ఇలాంటి తరుణంలో పేదలు మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వినియోగించే ప్రజా రవాణా ఆర్టీసీలో చార్జీలు పెంచటం వారిపై తీవ్ర భారం మోపినట్లు అవుతుందని అన్నారు. ప్రభుత్వం పల్లె వెలుగుతో సహా అన్ని రకాల బస్సు సర్వీసుల పై పెంపును ఖండించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి ఆర్టీసీ ఛార్జీలు పెంచారని ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాత సంస్థ కు అండగా నిలవాలిసింది ప్రభుత్వమేనని అన్నారు. చార్జీల పెంపును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వర్రె చిట్టి బాబు, పలువురు నాయకులు ఉన్నారు.

## పలువురు బీసీసామాజిక వర్గ నాయకులు జనసేన పార్టీలో చేరిక



పి గన్నవరం, ప్రజా పాలన ప్రతినిధి.. మండలం జనసేన అధ్యక్షులు సాధనాల శ్రీ వేంకట సత్యనారాయణ(జ్జడి)అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి కుమార్ ఆధ్వర్యంలో పి గన్నవరం మండలానికి చెందిన వైఎస్సార్సీపీ తెలుగుదేశం పార్టీకి చెందిన బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకులు తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు కందులదుర్గేష్‌సమక్షంలో జనసేన పార్టీ తీర్థంపుచ్చుకున్నారు.ఈ సందర్భంగాజిల్లా అధ్యక్షులు కందులదుర్గేష్ వారికి పార్టీకండువాకప్పి సాదరంగాపార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జాయినింగ్ అయినసభ్యులు మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రభుత్వం వివిధ పథకాలపేరుతో ప్రజలను మోసం చేస్తుందన్నారు జనసేనఅధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు పార్టీ సిద్ధాంతాలునచ్చి జనసేన పార్టీలోకి వచ్చామని తెలియజేశారు ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ బడుగు బలహీనవర్గాల పార్టీ అని రాబోయేరోజుల్లో జనసేన పార్టీ ఒక ఉన్నతమైన బలమైన పార్టీగా ఏర్పడనుందన్నారు. పార్టీఅధ్యక్షులు పవన్ కళ్యాణ్ .పేదబడుగు బలహీన వర్గాల ఓసి,బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తారన్నారు ఇప్పుడున్న ప్రభుత్వం నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు,ఆర్టీసీఛార్జీలు,గ్యాస్ ధరలు పెంచుకుంటూపోతూ పేదవాడికి నెత్తిమీద బండరాయి మోపి ప్రజలనుఇబ్బందిపాలు చేస్తున్నారన్నారు రాబోయే రోజుల్లో జనసేన పార్టీకి రాజ్యాధికారం వస్తుందని ధీమావ్యక్తంచేశారు ఈ సందర్భంగా పార్టీలోకి జాయినైనఅందరికీప్రత్యేక కృతజ్ఞతలుతెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు జిల్లా కార్యదర్శి మద్దాలచంటిబాబు యడ్ల ఏనుభాస్కరరావు, తాటికాయుల వెంకటేష్,దైవాలరాంబాబు, షేక్ దొరబాబు,ఖైరశెట్టి శంకర్,ముసిని భాస్కరరావు,వాసంశెట్టి గోవిందు,కండిబోటి నర్సింహారావు ,కండిబోటి సాయిబాబు,గుబ్బలశివ,కాండ్రేగుల సాయిబాబు,మట్టపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబెరుమన్నార్ స్వామిని దర్శించుకున్న కొవ్వలి



నరసాపురం, ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) : పట్టణంలోని కోవెలగుడిగా పేరుగాంచిన అత్యంత పురాతన పుణ్యక్షేత్రం శ్రీ ఆదికేశవ ఎంబెరుమన్నార్ స్వామి వార్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్నారై కొవ్వలి రామ్మోహన్ నాయుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎంబెరుమన్నార్ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామ్మోహనాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొవ్వలి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ స్వామి వార్ల కరుణాకటాక్షాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆశీస్సులతో వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావాలని నారా చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని స్వామివార్లను వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీలు పుప్పాల వెంకటకృష్ణారావు, ఆదినారాయణ, నిమ్మకాయల గోపాలరావు, నీలిమ, చెక్కల సత్యదేవ్, సంకు భాస్కరనాయుడు, గుగ్గిలపు సూర్యనారాయణ, భోగిరెడ్డి ముత్యం, కొరాడ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాలివ్వాలని కలెక్టర్‌ని కలిసిన బాధితులు



నరసరావుపేట.ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట పట్టణం పన్నెండు వ వార్డు బాపనయ్యనగర్ నందు గత 30 సంవత్సరాల పైబడి అక్కడే ఉన్న ప్రభుత్వ స్థలంలో చిన్నచిన్న గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతోపాటు అగ్ర కులాల్లోని పేదలు దాదాపుగా రెండు వందల కుటుంబాలకు పైన కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న వీరికి పట్టాలు మంజూరు చేయాలని ఆ ప్రాంత వాసులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ ని కోరటం జరిగింది.ఈ సందర్భంగా వారితో పాటు మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గోదా జాన్ పాల్ పాల్గొని మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న నిరుపేదలు కూలీనాలీ చేసుకుంటూ కార్మికులుగా ఆటోడ్రైవర్లుగా చెక్క పనులు పెయింట్ పనులకే పరిమితమైన వీరికి పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను అలాగే జిల్లా అధికారులను కలవడం జరిగినప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదని ప్రస్తుతం అధికారంలో ఉండబడే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి 15 సంవత్సరాల పైబడి ప్రభుత్వ స్థలాల్లోలి లినివానవుంటున్నవారికి రెగ్యులరైజేషన్ పేరిట వందగజాలలోపు ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక రూపాయికే రిజిస్ట్రేషన్ చేయాలని త్వరితగతిన సర్వే నిర్వహించాలని అధికారులకు చెప్పినప్పటికీ బావనయ్య నగరవాసులకు ఆ సర్వే నోచుకోలేదని ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ఈ పల్నాడు జిల్లాలో ఈ యొక్క జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలిప్పించె దిశగా కృషి చేయాలని ఆయున మాట్లాడారు ...స్పందించిన కలెక్టర్ మున్సిపల్ అధికారులకు మరియు రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చి త్వరలో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తానని తదుపరి పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారులి జిల్లా కలెక్టర్ ని కలసిన వారిలో చావా నాసారమ్మ అనురాధ షేక్ వలి షేక్ నాయబ్ రసూల్ మేడా వెంకట గోవిందమ్మ మొగిలి వరలక్ష్మి లక్ష్మి జంగా షేక్ సుభానీ స్వప్న చావా కోటేశ్వరరావు మక్కెన సుబ్బారావు బూదాల రాణి కాశయ్య నాగరాజు మాలమహానాడు పట్టణ సెక్రటరీ మెడబలిమి సాంబశివ తదితరులు ఉన్నారు.

## ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలో ఉంటాను

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్–చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు**



నరసరావుపేట.ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) :లిప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే ఉంటానని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్–చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు అన్నారు.రొంపిచర్ల మండలంలో అలవాల,అచ్చయ్యపాలెం గ్రామాల శివారులో గల ముత్యంజయపురంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది.ఈ తిరునాళ్ళ మహోత్సవానికి విచ్చేసిన డా.చదలవాడ అరవింద బాబుకు టీడీపీ నాయకులు,కార్యకర్తలు,ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అక్కడ టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ఎలక్ట్రికల్ ప్రభలు వద్దకు వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.అక్కడ ఉన్న ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో తనను మూడు సంవత్సరములుగా ఆదరిస్తున్న టీడీపీ నాయకులు,కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు.పంజాబ్,ఢిల్లీలో ఆఫ్ పరిపాలనలో లేని అవినీతి, అప్పులు ఈ రాష్ట్రంలో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో అవినీతి రోజు రోజుకు పెరిగిపోతుందని అన్నారు.జగన్ పాలనలో అవినీతి నాయకులు పెరిగిపోతున్నారని అన్నారు.నూతనంగా మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేసిన వారిలో కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవటం దారుణమని అన్నారు. జగన్ పరిపాలన పై ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందని అన్నారు.టీడీపీ పాలనకై ఆశగా ఎదురు చూస్తున్నారని అన్నారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని అన్నారు.టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికులాగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు,టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి,మాజీ ఎంపీపీ మొండితోక రామారావు,పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మేత కోటి రెడ్డి,మందలపు వెంకట్రావు,పల్లెల నాగిరెడ్డి,మందలపు వెంకట్ రత్నం, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు మెడబలిమి నవీన్,ఐటీడీపీ అధ్యక్షుడు అప్పారావు, పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా స్పందన కార్యక్రమానికి 56 ఫిర్యాదులు...



పల్నాడు జిల్లా . నరసరావుపేట.ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రజా సమస్యల పరిష్కారంలో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఐపీఎస్ సత్వరమే ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు సోమవారం నూతన పల్నాడు జిల్లాలో ప్రారంభమైన లిప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందనా కార్యక్రమంలి లో పాల్గొని,నేరుగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ రవిశంకర్ రెడ్డి.లిఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్థానిక నరసరావుపేట



డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన లిస్పందనా కార్యక్రమానికి 56 ఫిర్యాదులు వచ్చాయనిలి,సదరు ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగినదని తెలిపారు. ఫిర్యాదులలో ఎక్కువగా కుటుంబ తగాదాలు,ఆర్థిక పరమైన తగాదాలకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. స్పందనా కార్యక్రమానికి విచ్చేసిన ఫిర్యాదుదారుల సౌకర్యార్థం కుర్చీలు,మంచినీటిని అందించారు. ప్రజలు తమ ఫిర్యాదులను వ్రాసికొనుటకు పోలీస్ సిబ్బంది తమ సహాయాన్ని అదించినారు. తదనంతరం దూరప్రాంతముల నుండి స్పందనా కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు భోజనమును సదుపాయమును కల్పించి, స్వయంగా వడ్డించిన ఎస్పీ. ఈ కార్యక్రమంలో దిశా డిఎస్పీ రవిచంద్ర ,ఎస్బి సీఐ విజయచంద్ర ,ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వాలంటీర్ల రుణం తీర్చలేనిది: ప్రభుత్వచీఫ్ విప్ ముదునూరి



నరసాపురం, ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) : వాలంటీర్ల రుణం తీర్చలేనిదని వాలంటీర్ల సేవలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం నరసాపురం మండలం యల్.బి చర్ల గ్రామంలోని జడ్పీ హై స్కూలులో జరిగిన పి.ఎం లంక, తూర్పుతాళ్ళు, చామకూరి పాలెం,%ఎ%పసలదీవి, యల్. బి చర్ల, వైయస్ పాలెం, సారవ, లక్ష్మణేశ్వరం, పెదలంక, దర్బరేవు, మర్రితిప్ప, బియ్యపుతిప్ప, వేములదీవి ఈస్ట్, వెస్ట్ గ్రామాల వాలంటీర్లకు సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. వాలంటీర్ల విశిష్ట సేవలకు గుర్తింపుగా అందించే సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నరసాపురం నియోజకవర్గంలో వెయ్యి మంది వాలంటీర్లకు ఈ అవార్డుల కార్యక్రమం 20 రోజుల పాటు నిర్వహిస్తున్నామని సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర ప్రోత్సాహకాలను అందిస్తున్నామని అన్నారు. గత సంవత్సరం 240 కోట్లు, ఈ సంవత్సరం 340 కోట్ల మొత్తం ఖర్చు చేస్తున్నామని నరసాపురం నియోజకవర్గంలో రూ. 10 కోట్ల 50 లక్షలు ఖర్చుబెట్టామని ఈరోజు 14 గ్రామాల వాలంటీర్లకు సంబంధించి 178 మందికి సేవామిత్ర,1 కి సేవావజ్ర, సేవారత్న ఐదుగురికి అందించామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లు ఒక వారధిలా పనిచేస్తున్నారని ప్రజల వద్దకు పరిపాలనను చేరవేయడంలో వాలంటీర్లు చేసే కృషి మరువలేనిదని, కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వాలంటీర్లు సేవలందించారని విప్లవాత్మకమైన మార్పులు చేస్తూ వాలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపట్టారని దేశం మొత్తం ఈరోజు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా వాలంటీర్ వ్యవస్థ ఏర్పడిందని అన్నారు. కుల,మత,ప్రాంతాలకు అతీతంగా వాలంటీర్ వ్యవస్థ ద్వారా సేవలందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, వైస్ ఎంపీపీ తిరుమాని దుర్గ తాతారావు, దొంగమురలీకృష్ణ, ఎంపీడీఓ శివప్రసాద్ యాదవ్, ఎమ్మార్వో బాజీ సత్యనారాయణ, గుబ్బల యమునా బాను, బొడ్డు ఆశిష్ కుమార్, సంగాని వెంకట దుర్గాభవాని, మెంటు మస్తాన్, అంద్రాజు చల్లారావు తదితరులు. పాల్గొన్నారు.

## బూరగడ్డ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 18,:గుడివాడ నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా గుడివాడ జనసేన పార్టీ ఆఫీస్ లో వేమూరి త్రినాధ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తలు, జనసైనికుల మధ్య అంగ రంగ వైభవంగా జరిగినవిఈ కార్యక్రమంలో కొదమల గంగాధరరావు ( జిల్లా కార్యదర్శి ), షేక్ మీరా షరీఫ్, దుర్గారావు, వడ్డాది లక్ష్మీకాంత్, అజయ్, సాయి పవన్, వెంకటేష్, డాన్ బాయ్,సాయినా రాజేష్,వరుపుల శీను మరియు జనసైనికులు పాల్గొన్నారు

## అగ్నిమాపక వారోత్సవాలు



పామర్రు, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 18:అగ్నిమాపక వారోత్సవాలు లో బాగంగా పామర్రు అగ్నిమాపక కేంద్రం వారు ఈ రోజు తమ్మా కోటమ్మ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ లో అగ్నిప్రమాదాలు జరగకుండా అవగాహన సదస్సు పామర్రు అగ్నిమాపక అధికారి రాంబాబు ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కాలేజీ యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు

## నాయుడమ్మ వ్యాసాలు ప్రసంగాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు




గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్18:ఉంగుటూరు మండలం ఆత్మకూరు లో నాయుడమ్మ ఫౌండేషన్ ముద్రించిన డా. ఎలవర్తి నాయుడమ్మ వ్యాసాలు ప్రసంగాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన భారత ఉ పరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిజోరం గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ మాజీ మంత్రి స్వర్ణ భారతి ట్రస్ట్ చైర్మన్ డా. కామినేని శ్రీనివాస్ (నాని) డా. నాయుడమ్మ పౌండేషన్ చైర్మెన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## నిడమానూరు లో హెూం మంత్రి కి ఘన స్వాగతం



గన్నవరం ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్18: ఆంధ్రప్రదేశ్ హెూంశాఖ మంత్రి గా తానేటి వనిత సోమవారం బాధ్యతలు స్వీకరించేందుకు కొవ్వూరు నుండి రోడ్డు మార్గాన సచివాలయం కు వెళ్ళే మార్గమధ్యలో విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామంలో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో పుష్పగుచ్చలు అందించి స్వాగత సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లీడ్ క్యాప్ డైరెక్టర్ కొనేరు సత్య ప్రియ, గన్నవరం సర్పంచ్ సౌజన్య,నిడమానూరు పి.ఎ.సి.యస్ చైర్మన్ బొప్పన కృష్ణ,వైసిపి నాయకులు నిడమర్తి నాగేశ్వర రావు స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సచివాలయాల లో సంక్షేమ పథకాలు అందించడంలో కీలకపాత్ర వెల్ఫేర్ అసిస్టెంట్‌లదే: ఎంపీడీవో కుమార్



పి.గన్నవరం :ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లో కీలక పాత్ర పోషించాలని పి.గన్నవరం ఎంపీడీవో కుమార్ సూచించారు. ఈ మేరకు మండలంలోని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన పి.గన్నవరం ఎంపీపీ కార్యాలయం వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని ఎంపిడిఓ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు

## దండే శ్రీనివాసరావు ఘటనపై చర్య తీసుకోవాలి




బాపట్ల జిల్లా ప్రజా పాలన: వేమూరు నియోజకవర్గం పెరవలి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు దండే శ్రీనివాసరావు ను వేమూరు పోలీస్ స్టేషన్ లో అమానుషంగా పరుష పదజాలంతో దూషించి విచక్షణా రహితంగా కొట్టిన ఘటనపై విచారణ చేపట్టి, మతిస్థిమితం లేని మాజీ సైనికుడికి న్యాయం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమం వారి ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సంఘం వారి సహకారంతో ఈరోజు బాపట్ల జిల్లా వకుల్ జిందాల్ గారిని కలిసి స్పందనలో తమ అర్జిని అందించటం జరిగింది. కార్యక్రమంలో సెక్రెటరీ గుప్త, మహిళా అధ్యక్షురాలు సీతా దేవి, తెనాలి అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజు, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అడ్వకెట్ కమల్ కుమార్, ఆది నారాయణ, బాపట్ల నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ తాండ్ర సాంబశివరావు, సెక్రెటరీ తోట దుర్గారావు, బక్క రామకృష్ణ రెడ్డి, పుట్టా ఆది శేష రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, కో కి ధర్మారెడ్డి, కృష్ణ మొదలగు మాజీ సైనిక సంక్షేమ సంఘాలు పాల్గొన్నారు.

## నల్లగార్లపాడు రోడ్డు బాగుచేయించండి: కలెక్టర్‌కు వినతి పత్రం




నరసరావుపేట.ఏప్రిల్ 18 (ప్రజాపాలన ప్రతినిధి): పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి దళిత బహుజనుల హక్కులపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డా.గోదా రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్ వాసులు స్పందన కార్యక్రమానికి మా రోడ్డు బాగుచేయించండి మహాప్రభో...అంటూ ప్లకార్డులతో నిరసన తెలుపుతూ పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి గారిని కలసి వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం డా.గోదా రమేష్ కుమార్ కలెక్టర్ తో మాట్లాడుతూ రావిపాడు నుండి నల్లగార్లపాడు వెళ్ళే రహదారి పూర్తిగా గుంతలమయమైందని కనీసం కాలినడకన గ్రామానికి చేరాలన్న వీలుపడే పరిస్థితి లేదని ఈ రహదారిలో ఇప్పటికే హైస్కూళ్ళలో,కాలేజ్ లలో చదివే విద్యార్థినీ,విద్యార్థులు సైకిళ్ళపై,బైక్ లపై వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు గురై కాళ్ళు,చేతులు విరిగిన సంధర్భాలు ఉన్నాయని,ఇద్దరు మృతి చెందిన సంధర్భాలు ఉన్నాయని,సుమారుగా 10సంవత్సరములపైగా ఈరోడ్డు మరమ్మత్తులకై నల్లగార్లపాడు గ్రామ అంబేద్కర్ నగర్ వాసులు మరియు గ్రామస్తులు ఎదురు చూస్తున్నారని ప్రస్తుతం గర్భిణీ స్త్రీలు కనీసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళేలోపే ప్రసవం జరుగుతున్న పరిస్థితులు చూస్తున్నామని,వర్షాకాలంలో ఆయా రోడ్డుపై గుంతలలో నీరు చేరడంతో ప్రయాణికులు ఆయా గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఈరోడ్డు టెండర్ 68లక్షల 26వేలకు గుంటూరుకు చెందిన వెన్నా రవీంద్రారెడ్డి అనే కాంట్రాక్టర్ టెండర్ వేసి సంవత్సరం నుండి పనులు చేపట్టడంలేదని గతంలో రెండు మూడు సార్లు స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారు కాంట్రాక్టర్ తో మాట్లాడినా కంట్రాక్టర్ అదుగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని తక్షణమే నల్లగార్లపాడురోడ్డు మరమ్మత్తులు చేయించాలని కోరారు.వెంటనే పల్నాడు జిల్లా కలెక్టర్ సంబంధిత ఈఈని పిలిచి తక్షణమే రోడ్డును పరిశీలించి రోడ్డు మరమ్మత్తు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొమ్మాలపాటి శేషగిరి, కొమ్మాలపాటి మాణిక్యరావు, ఈదర గోపీచంద్, పి.సతీష్ కుమార్,హరనాథ్,సిహెచ్ అనురాధారెడ్డి,యర్రంశెట్టి వెంకట నరసింహారావు,న్యాయవాది వంకాయలపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీకి 23 చెత్త వర్రలు అందజేత



చందోలు(పిట్టలవాని పాలెం) ఏప్రిల్18 :: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర రహదారుల డైరెక్టర్ అహమ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చందోలు పంచాయతీకి చెందిన 10 వ వార్డు మెంబర్ సల్మాబేగం, (జుల్ఫేఘరబెగ్) చందోలు పంచాయితీలో ప్రజలు చెత్తాచెదారాన్ని వేసుకోవడానికి 23 వర్రలను సోమవారం ఆహమ్మద్ హుస్సేన్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్ లోనూ, వర్ర ల లోనూ వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు అల్తాఫ్, రామిజ్, నన్నే తదితరులు పాల్గున్నారు.

## ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న పేద వారికి పట్టాలు ఇవ్వాలి



పలనాడు జిల్లా, నరసరావుపేట (ప్రజాపాలన బ్యూరో): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని 12 వ వార్డులోని బాపనయ్యనగర్ నందు గత 30 సంవత్సరాల పైబడి అక్కడే ఉన్న ప్రభుత్వ స్థలంలో చిన్నచిన్న గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలతోపాటు అగ్ర కులాల్లోని పేదలు దాదాపుగా రెండు వందల కుటుంబాలకు పైన కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని ఆ ప్రాంత వాసులు ఈరోజు స్పందనలో జిల్లా కలెక్టర్ గారిని కోరటం జరిగింది.ఈ సందర్భంగా వారితో పాటు మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గోదా జాన్ పాల్ పాల్గొని మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న నిరుపేదలు కూలీనాలీ చేసుకుంటూ కార్మికులుగా ,ఆటోడ్రైవర్లుగా చెక్క పనులు పెయింట్ పనులకే పరిమితమైన వీరికి పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను అలాగే జిల్లా అధికారులను కలవడం జరిగినప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదని ప్రస్తుతం అధికారంలో ఉండబడే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి 15 సంవత్సరాల పైబడి ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్నవారికి రెగ్యులరైజేషన్ పేరిట వందగజాల లోపు ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక రూపాయికే రిజిస్ట్రేషన్ చేయాలని త్వరితగతిన సర్వే నిర్వహించాలని అధికారులకు చెప్పినప్పటికీ బాపనయ్యనగర వాసులకు ఆ సర్వే నోచుకోలేదని ఇప్పటికైనానూతనంగా ఏర్పడిన ఈ పల్నాడు జిల్లాలో ఈ యొక్క జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలిప్పించె దిశగా కృషి చేయాలని ఆయన మాట్లాడారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్ అధికారులకు మరియు రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చి త్వరలో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తానని తదుపరి పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ గారిని కలసిన వారిలో చావా నాసారమ్మ ,అనురాధ, షేక్ వలి, షేక్ నాయబ్, రసూల్, మేడా వెంకట గోవిందమ్మ , మొగిలి వరలక్ష్మి, లక్ష్మి జంగా, షేక్ సుభానీ, స్వప్న చావా కోటేశ్వరరావు, మక్కెన సుబ్బారావు, బూదాల రాణి, కాశయ్య నాగరాజు, మాలమహానాడు పట్టణ సెక్రటరీ వెండబలిమి సాంబశివ తదితరులు ఉన్నారు.

## మంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన జెడ్పిటీసీ లు, ఎ ఎం సి చైర్మన్



చీరాల, ఏప్రియల్ 18, ప్రజాపాలన : వెలగపూడిలోని సచివాలయంలో, కార్మిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మేరుగు నాగార్జున ని, నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుని మరియు పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్‌లని, చీరాల నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో, చీరాల నియోజకవర్గపరిధిలోని జెడ్పిటీసీ లు, ఎఎంసి చైర్మన్, ఎఎంసి డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి, వారికి శుభాకాంక్షలు తెలియజేసారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని, మంత్రులకు విజ్ఞప్తి చేశారు. తొలుత మంత్రులకు పుష్పగుచ్ఛాలు అంద జేసి, మర్యాద పూర్వకంగా సన్మానించారు. వారిలో,చీరాల మండలం జెడ్పిటిసి ఆకురాతి పద్మినీదేవి,వేటపాలెం మండలం జెడ్పిటీసీ సభ్యురా లు బండ్ల తిరుమలాదేవి,చీరాల ఎ.ఎం.సి. ఛైర్మన్ మార్పు గ్రేగొరీ,మున్సిపల్ కౌన్సిలర్లు, ఎ.ఎం.సి. డైరెక్టర్లు,చీరాల వైసిపినాయకులున్నారు.

## అండగా ఉంటానమ్మా..,అధైర్యపడవద్దు: బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



చీరాల, ఏప్రియల్ 18, ప్రజాపాలన : అధైర్యపడవద్దు.., అండగా ఉంటానమ్మా..,మీ సమస్య ఏంటో చెప్పండి.., పరిష్కరిస్తా అంటూ.., .స్వయంగా వృద్ధురాలి వద్దకి వచ్చి,భరోసా కల్పిస్తూ,బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పిన ఓదార్పు మాటలకు,స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలు మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.అంత పెద్దఅధికారి అయి ఉండి, వచ్చి ఓదార్చటమే కాకుండా, పరి ష్కరిస్తానని హామీ ఇచ్చారు,ఆ ఒక్కమాట చాలయ్యా అంటూ, వృద్ధురాలు ఆనందభాష్పాలు రాల్చిన ఘటన, బాపట్ల జిల్లా ఎస్పీ స్పందనకార్యా లయ ఆవ రణలో సోమవారం చోటు చేసుకుంది.స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా పిర్యాదులను పరిష్కరించేందుకు, ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల సత్వర పరిష్కారవేదిక 'స్పందన' కార్యక్రమమును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ పిర్యాదు దారుల నుండి అర్జీలు స్వయంగా స్వీకరించారు. జిల్లాలో పలుప్రాంతాల నుండి, పిర్యాదుదారులు నేరుగా వచ్చి, తమతమ పిర్యాదులను, వ్రాతపూర్వకంగా విన్నవిం చుకున్నారు. నడవలేని వికలాంగులు, వృద్ధుల వద్దకు స్వయంగా ఎస్పీ వెళ్ళి, వారి సమస్యలు గురించి ముఖాముఖి మాట్లాడి, అడిగి తెలు సు కొని, వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. తమ సమస్యల గురించి, ఫిర్యాదుదారులు ఎస్పీకి, స్వేచ్ఛగా విన్నవించుకున్నారు.జిల్లా ఎస్పీ ప్రతి ఒక్క పిర్యాదుకు,సంబంధించిన అన్ని విషయాలను క్షుణ్ణంగా అడిగితెలుసుకొని,సంబంధిత పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అధికారులతో, వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, ఆయా ఫిర్యాదులన్నింటిపై, చట్టప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించి, భాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.సమస్యల పరిష్కారం కొరకు, పోలీసు స్టేషన్లు/కార్యాలయాలకు వచ్చు పిర్యాదుదారులతో, పోలీసు అధికారులు మరి యు సిబ్బంది అందరూ, మర్యాదగా వ్యవహరించి, చట్టపరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు.

## పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు -నాలుగు గంటలపాటు కొనసాగిన ఉత్కంఠత



వేటపాలెం, ఏప్రిల్18, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ పరిధిలోని వేటపాలెం సమీపంలో, గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో, నాలుగు గంటలపాటు ఉత్కంఠత నెలకొంది. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు, ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ప్రజలు భయపడుతూ చూస్తుండిపోయారు. విజయవాడ నుండి అధికారులబృందం రావడం, నానాకష్టాలు పడి కొన్ని గంటల తర్వాత, గూడ్స్ యధా విధిగా పట్టాలపై వచ్చేలా చేసేందుకు తల ప్రాణం తోకకు వచ్చింది. విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్ స్వయంగా వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఆయన పర్యవేక్షణలో అధికారులు గూడ్సును, యధావిధిగా పట్టాల పైకి తీసుకొచ్చేందుకు శ్రమించారు. పొరపాటున అదే సమయంలో వేరే ట్రైన్ వస్తే పరిస్థితి ఏంటి ఏమి జరుగుతుందోనని, నాలుగు గంటల పాటు, భయం భయంగా, బిక్కుబిక్కుమంటూ, ఉత్కంఠతతో ఎదురు చూసిన ప్రజలు, ఎటువంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా,సమస్య పరిష్కారంఅవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

## మంత్రి మేరుగ నాగార్జునను, సన్మానించిన చీరాల నేతలు



చీరాల, ఏప్రియల్ 18, ప్రజాపాలన : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ, నూతన సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున ని, గుంటూరు లోని వారికార్యాలయంలో, వైయస్సార్ సీపీ యువనేత కరణం వెంకటేష్ బాబు, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి,లు మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## భవిష్యత్‌కు పదో తరగతి మార్కులే కీలకం: బాలికోన్నత పాఠశాల హెచ్ ఎం. కృష్ణ మోహన రావు



చీరాల, ఏప్రియల్ 18, ప్రజాపాలన : చిన్న ఉద్యోగ మైనా, ఉన్నత స్థాయి ఉద్యోగం అయినా, పదో తరగతిలో వచ్చే మార్కులను, కీలకం గా పరిగణనలోకి తీసుకుంటారని, చీరాల కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నతపాఠశాల హెచ్.ఎం.టి.కృష్ణ మోహనరావు అన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచిఫలితాలు సాధించాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం,పాఠశాలలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి.బాబు, హైమావతి, జయచంద్ర, విజయలక్ష్మి, శ్రీదేవి, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్ల వ్యవస్థ.. దేశానికే రోల్ మోడల్

### జగనన్న లక్ష్య సాధనకు కలిసికట్టుగా ముందుకు సాగుదాం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ: గ్రామ/ వార్డు వాలంటీర్లు తమ బాధ్యతలను సైనికుల్లా నిర్వర్తిస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు అన్నారు. సత్యన్నారాయణపురం ఎకెటిపిఎమ్ పాఠశాల నందు 31, 33, 36 డివిజన్ల వాలంటీర్లకు నిర్వహించిన 'సేవా పురస్కారాల ప్రదానోత్సవ' వేడుకలలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలకు గానూ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన రెండున్నరేళ్లలో రూ. 465 కోట్ల నిధులను ప్రత్యేకంగా కేటాయించి.. ప్రోత్సాహకాల రూపంలో వాలంటీర్లకు అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో ఎన్నికలను ఎదుర్కొన్న జగనన్న అధికారంలోకి వచ్చాక ఆ దిశగా అడుగులు వేశారన్నారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఆగస్ట్ 15, 2019న వాలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టి 2 లక్షల 66వేల 92 మంది వాలంటీర్లను నియమించారన్నారు. దేశ చరిత్రలోనే ఇదొక రికార్డని వ్యాఖ్యానించారు. వీరిలో 55 శాతానికి పైగా మహిళలను నియమించడం.. మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. ప్రజలకు సేవచేసే అవకాశం అందరికీ రాదని, వచ్చినప్పుడు దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరోనా సమయంలో వాలంటీర్లు సైనికుల్లాగా పని చేశారని మల్లాది విష్ణు గుర్తుచేశారు. కరోనా టెస్టులు, వ్యాక్సినేషన్ ప్రక్రియ, డోర్ టూ డోర్ ఫీవర్ సర్వే, సత్వర చికిత్సకు చర్యలతో మన రాష్ట్రంలో మరణాల సంఖ్యను తగ్గించడంలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించారన్నారు. నగరంలోకి కొత్త వారు వస్తే గుర్తించి క్వారంటైన్‌కు తరలించడం, క్వారంటైన్‌లో వారి బాగోగులు చూసుకోవడం, కరోనా సోకినవారికి నైతిక ధైర్యమిస్తూ అండగా నిలబడ్డారన్నారు. కరోనా నియంత్రణలో ఏపీ ప్రభుత్వం కేంద్రం ప్రశంసలు అందుకుందంటే వాలంటీర్ల ఎనలేని సేవలే అందుకు కారణమని మల్లాది విష్ణు అన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ ప్రధాని సహా దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వాలంటీర్ల వ్యవస్థను కీర్తిస్తుంటే.. మన రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలు మాత్రం వ్యవస్థపై విమర్శలు గుప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం విమర్శలను కృంగిపోకుండా జగనన్న ఆశయ సాధనకు సైనికుల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లిస్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా వాలంటీర్ల వ్యవస్థ పనిచేస్తుందని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వారి సేవలు ప్రశంసనీయమన్నారు. లి36వ డివిజన్ కార్పొరేటర్ బాలిగోవింద్ మాట్లాడుతూ పురస్కారాలను స్ఫూర్తిగా తీసుకుని సేవా వజ్ర అవార్డులను సొంతం చేసుకునేలా రాబోయే రోజుల్లో మరింత సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష మాట్లాడుతూ సేవా భావంతో పనిచేస్తున్న ప్రతి వాలంటీర్ వజ్రాలేనని పురస్కారానికి ఎంపికైన ప్రతిఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రేమ లక్ష్మీకుమారి, 33వ వార్డు వాలంటీర్ (సేవామిత్ర అవార్డు గ్రహీత) మాట్లాడుతూ.. వాలంటీర్లకు సేవలోనే ఆనందం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున అందిస్తున్న సంక్షేమానికి వారధులుగా జగనన్న తమను నియమించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో వాలంటీర్ల వ్యవస్థను పటిష్టం చేస్తూ.. వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు గారికి ఈ సందర్భంగా మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, బాలిగోవింద్, పెనుమత్స శిరీష సత్యం, డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శిష్లా రామలింగమూర్తి, జోనల్ కమిషనర్ రాజు, సీఐ బాలమురళికృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# క్లాస్ పీకిన రకుల్ ప్రీత్ సింగ్



టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగి బాలీవుడ్ కి చెక్కేసింది రకుల్ ప్రీత్ సింగ్.. ఇక బాలీవుడ్ లో వరుస సినిమాలతో బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇటీవల వరుస ఫోటో షూట్స్ తో రచ్చ చేస్తోంది ఈ భామ. ప్రసుతం ఈ అమ్మడి చేతిలో దాదాపు అరడజనుకు పైగా బాలీవుడ్ సినిమాలు ఉన్నాయి. రకుల్ లేటెస్ట్ మూవీ రన్ వే 34. ఈ సినిమా ఏప్రిల్ 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రకుల్ ఈ చిత్ర ప్రమోషన్స్ లో పాల్గొంటోంది. రన్ వే మూవీలో రకుల్ పైలట్ తాన్యా రోల్ చేస్తోంది. ఈ మూవీలో అజయ్ దేవ్ గణ్ అమితాబ్ వంటి స్టార్స్ ప్రధాన పాత్రలు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా మీడియాతో ముచ్చటిస్తూనే సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ రచ్చ రచ్చ చేస్తోంది రకుల్. టాలీవుడ్ లో వరుసగా అగ్ర హీరోలు అందరితో నటించిన రకుల్.. ఆ తర్వాత బాలీవుడ్ వైపు వెళ్లిపోయింది. ఇక అక్కడే బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ప్రేమలో పడింది ఈ యాపిల్ బ్యూటీ. జాకీ భగ్నానీతో ప్రేమలో ఉన్నట్లు కొన్నాళ్ల క్రితమే అధికారికంగా పోషళ్ మీడియాలో వెల్లడించింది. ఇక అప్పటి నుండి మీడియా అభిమానులు నెటిజన్లు మీరు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అని అడుగుతూనే ఉన్నారు. మొదట్లో ఈ ప్రశ్న అడిగిన ప్రతి సారి ఇప్పుడే చేసుకోము చేసుకుంటే చెప్తాము అంటూ సమాధానాలిచ్చేది రకుల్. అయినా వరుసగా మీడియా మముందుకొచ్చిన ప్రతి సారీ ఈ ప్రశ్న కచ్చితంగా ఎదురవుతోంది. ఇటీవల బాలీవుడ్ లో ఓ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా పెళ్లి గురించి ప్రశ్నించగా ఈ సారి కొంచెం ఘాటుగానే స్పందించింది. పెళ్లి ప్రశ్నకి సమాధానమిస్తూ.. ఇది చాలా సాధారణ విషయం. ప్రతి ఒక్కరి జీవితంలో జరిగేదే. అమ్మ నాన్న తమ్ముడు ఎలా ఉంటారో జీవిత భాగస్వామి కూడా ప్రతి మనిషికి ఉంటారు. దాని గురించి ప్రత్యేకంగా మాట్లాడటం అనవసరం. దయ చేసి ఇలా ప్రతి సారి అడగొద్దు. మా బంధం గురించి ఏదైనా చెప్పాల్సి వస్తే నేనే స్వయంగా చెప్తాను. అంతే గాని ఇలా ప్రతి ఇంటర్వ్యూలోనూ తన గురించి చెప్పాల్సిన అవసరం నాకు లేదు. అని రకుల్ కొంచెం స్ట్రాంగ్ గానే వార్నింగ్ ఇచ్చింది.

## సినీ ప్రేమికులకు ఆచార్య విజువల్ ట్రీట్ కానుంది: కొరటాల శివ



మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఆచార్య. కొణిదెల ప్రొడక్షన్ కంపనీ మరియు మాట్నీ ఎంటర్ టైన్మెంట్ పతాకం పై ఈ చిత్రాన్ని నిరంజన్ రెడ్డి మరియు అన్వేష్ రెడ్డి లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి స్వర బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నుండి విడుదల అయిన ప్రచార చిత్రాలు, వీడియో లు, పాటలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి విశేష స్పందన లభిస్తోంది. తాజాగా ఈ చిత్రం గురించి దర్శకుడు కొరటాల శివ ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆచార్య అభిమానులకు, సినీ ప్రేమికులకు ఈ చిత్రం విజువల్ ట్రీట్ కానుంది అని అన్నారు. స్వచ్ఛమైన వాణిజ్య విలువలతో కూడిన ప్లాట్ ఇది అని అన్నారు. అంతేకాక మెగాస్టార్ చిరంజీవి మరియు చరణ్ ల కాంబినేషన్ చూడటానికి ఆనందంగా ఉంటుంది అంటూ చెప్పుకొచ్చారు. ఈ చిత్రం లో కాజల్ అగర్వాల్, పూజా హెగ్డే లేడీ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఏప్రిల్ 29, 2022 న ప్రపంచ వ్యాప్తంగా భారీగా థియేటర్ల లో విడుదల కాబోతున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఆ ఇద్దరి పేరెత్తితే మండిపోతున్న ఫ్యాన్స్!



ఆ ఇద్దరి హీరోల అభిమానుల ఓపిక నశించింది. సహనం క్షీణించింది. ఎంత కాలం ఎంత కాంల ఇంకెతం కాలం ఇలా. ఇన్నాళ్లు పెదవి దాటని మౌనాన్ని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. మా సహనాన్నే పరీక్షించారంటూ మండిపడుతున్నారు. సోషల్ మీడియ వేదికగా తమ బాధని వెళ్లగక్కుతున్నారు. అందుకు ప్రధాన కారకులపైనే అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఎవరా ఇద్దరుహీరోలు? ఎందుకంతలా టార్గెట్ అయ్యారు? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ చిత్రం విషయంలో నెలకొన్నతారక్ అభిమానుల అసహనం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే సెట్స్ కు వెళ్లాల్సిన ప్రాజెక్ట్ ఇంకా ప్రారంభం కాలేదు. దానికి తోడు 'ఆర్ ఆర్ ఆర్' తారక్ పాత్రకు పెద్దగా ప్రాధన్యం లేదంటూ అభిమానుల మండిపాటు తారక్ 30 వ చిత్రంపై ప్రభావం చూపింది. వీలైనంత త్వరగా ఆ అసంతృప్తిని తొలగించాల్సిన బాధ్యత తారక్ పైంది. 'ఆర్ ఆర్ ఆర్' సినిమా సెట్స్ లో ఉన్నప్పుడు వచ్చిన ప్రకటన ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. దర్శక-నిర్మాతలు నేమ్ సేక్ అప్ డేట్స్ ఇస్తూ మరింత అసహానికి గురయ్యేలా చేస్తున్నారని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. సరిగ్గా ఇదే పరిస్థితిని ఇప్పుడు మహేష్ ఎదుర్కుంటున్నారు. ఆయన కథానాయకుడిగా పరశురాం దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'సర్కారు వారి పాట' పాట అప్ డేట్స్ విషయంలో మేకర్స్ క్లారిటీ ఇవ్వడం లేదు. షూటింగ్ చివరి దశకు చేరుకుందని.. కొన్ని ఆన్ సెట్స్ చిత్రాలన్ని త్వరలో విడుదల చేస్తామని ప్రకటించారు. దీంతో మేకర్స్ పై మహేష్ ఫ్యాన్స్ మండిపోతున్నారు. 'వరస్ట్ టీమ్ ఎస్ వీపీ' అంటూ ట్విటర్ వేదికగా ట్రోల్ చేసి ట్రెండింగ్లో నిలిచేలా చేసారు. మూడు వారాల వ్యవధిలో సినిమా రిలీజ్ ఉంది. ఇంకా టీజర్.. పాటలు.. ట్రైలర్ రిలీజ్ కాలేదు. ఇంకా బీటీఎస్ చిత్రాలు ఇస్తామని చెబుతున్నారు. మేము ఏమైనా పిచ్చోళ్లలా కనిపిస్తున్నామ? అని మహేష్ అబిమాని ఒకరు ఆవేదన వ్యక్తం చేసాడు. ఈసందర్భంగా ఇక్కడో విషయం గుర్తు చేసుకోవాలి. గతంలో మహేష్ అభిమానుల ను ఉద్దేశించి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. "తన సినిమా నచ్చకపోతే తన అభిమానులే సినిమా చూడరని.. ఇలాంటి జెన్యూన్ అభిమానులు తనకు మాత్రమే" ఉంటారని అన్నారు. ఆయన చెప్పింది నిజమే అనడానికి ఇదొరక రకమైన ఉదాహరణగా చెప్పొచ్చు. కొంతమంది స్టార్ హీరోల అభిమానుల్లో ఇలాంటి నిజాయితీ కనిపించదు. ఆవిషయాన్ని మహేష్ బాగా పసిగట్టారు. ఇక తారక్ 30వ సినిమా అధికారిక పోస్టర్ రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ ఒత్తిడి తీసుకొస్తున్నారు. అప్ డేట్స్ ఇవ్వడంలో నిజాయితీ కనిపించలేదని.. ఇన్నాళ్లు ఓపిక పట్టి ఇప్పుడు ఓపెన్ అవుతున్నామని తారక్ అభిమాను ఒకరు ఏంటి ఈ నిర్లక్ష్యం అని ప్రశ్నించారు. మరి వీటిపై మహేష్..తారక్ ఎలాంటి బధులిస్తారో చూడాలి.

# అలరిస్తోన్న 'బూట్ కట్ బాలరాజు' బర్త్ డే గ్లింప్స్..!




బిగ్ బాస్ తెలుగు సీజన్-4 రియాలిటీ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సయ్యద్ సోహైల్ రియాన్. కథ వేరేలా ఉంటది అంటూ తన ప్రవర్తన ఆటతీరుతో అందరి అభిమానాన్ని చూరగొన్న ఈ సింగరేణి యువకుడు.. హౌస్ నుంచి బయటకొచ్చాక 'మిస్టర్ ప్రెగ్నెంట్' 'బూట్ కట్ బాలరాజు' అనే ఆసక్తికరమైన టైటిల్స్ తో హీరోగా రెండు సినిమాలను అనౌన్స్ చేశాడు. అందులో ఒకటి. లక్కీ మీడియా - గ్లోబల్ ఫిలిమ్స్ బ్యానర్స్ పై రూపొందుతున్న 'బూట్ కట్ బాలరాజు' చిత్రానికి కోనేటి శ్రీను దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో 'మల్లేశం' 'వకీల్ సాబ్' ఫేమ్ అనన్య నాగళ్ల హీరోయిన్ గా నటిస్తోంది. నేడు హీరో సోహైల్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ 'బూట్ కట్ బాలరాజు' చిత్ర బృందం ఓ స్పెషల్ గ్లిమ్స్ రిలీజ్ చేసింది. 'రింగా రింగా రింగా బిళ్ళా.. రూపాయి రూపాయి దండా..' అనే బ్యాగ్రౌండ్ మ్యూజిక్ తో వచ్చిన ఈ గ్లిమ్స్.. సినిమాలో హీరో పాత్ర ఎలా ఉండబోతుందో హింట్ ఇస్తోంది. టైటిల్ కు తగ్గట్టుగా సోహైల్ బూట్ కట్ ప్యాంట్స్ తో మాస్ లుక్ లో కనిపిస్తున్నాడు. అతని డైలాగ్ డెలివరీ - యాటిట్యూడ్ యూత్ ని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ వీడియో చివర్లో 'ఊరికి ఒక మంచి పనైనా చేసినవా రా?' అని వ్యక్తి అడగ్గా.. "ఎందుకు చేయలే.. మొన్న రాత్రి ఒకడు స్టాండ్ తీయకుండా బైక్ మీద పోతాంటే 'స్టాండ్ స్టాండ్' అని అరిసినా.. అది మంచి పని కాదా?" అని సోహైల్ చెప్పే విధానం నవ్వు తెప్పిస్తుంది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న 'బూట్ కట్ బాలరాజు' సినిమాలో యాక్షన్ పాళ్లు కూడా ఉన్నట్లు ఈ గ్లిమ్స్ ని బట్టి అర్థం అవుతుంది. గతంలో కొన్ని సినిమాలలో చిన్న సైడ్ క్యారెక్టర్స్ పోషించిన సోహైల్ రియాన్.. హీరోగా ఈ సినిమాతో ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి. ఇందులో ఇంద్రజ - వెన్నెల కిషోర్ - బ్రహ్మాజీ - ఆనంద్ చక్రపాణి - ఝాన్సి - ముక్కు అవినాష్ - జబర్దస్త్ రోహిణి - మాస్టర్ రామ్ తేజస్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. బెక్కం బబిత సమర్పిస్తున్న 'బూట్ కట్ బాలరాజు' చిత్రాన్ని ప్రముఖ నిర్మాత బెక్కం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. భీమ్స్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్యామ్ కె నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. విజయ్ వర్ధన్ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. గతేడాది డిసెంబర్ నెలలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.

# ముంబై టూ హైదరాబాద్ దేవరకొండ పరుగు!



యంగ్ హీరో విజయ్ దేవరకొండ ఫుల్ స్వింగ్ లో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. లైగర్ షూటింగ్ పూర్తికాగానే కొంత విరామం అనంతరం బ్యాక్ టూ బ్యాక్ రెండు చిత్రాల్ని ప్రారంభించారు. ఇటీవలే డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ జనగణమని ముంబైలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. భారీ అంచనాల మధ్య సినిమా ప్రారంభమైంది. లైగర్ రిలీజ్ కాకుండానే కాన్ఫిడెంట్ గా పూరి విజయ్ తో ముందుకెళ్లిపోయారు. స్క్రిప్ట్ పై నమ్మకంతోనే పూరి అంత ధీగామా ఉన్నారు. జేజీఎమ్ తో దేవరకొండని ఓ సూపర్ స్టార్ లా తీర్చిదిద్దుతానని కంకణం కట్టుకుని మరీ పూరి రంగంలోకి దిగిపోయారు. మే లో ఈ సినిమా రెగ్యలర్ షూటింగ్ చేయడానికి పూరి రెడీ అవుతున్నారు. దాదాపు మొదటి షెడ్యూల్ అంతా ముంబైలో నే ఉంటుంది. అటు పై కాశ్మీర్ బోర్డర్ కి వెళ్లనున్నారు. ఆర్మీబ్యాక్ డ్రాప్ స్టోరీ కావడంతో ఈ సినిమా షూటింగ్ కి పూరి ఎక్కువ రోజులే సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో విజయ్ మరో సినిమా షూటింగ్లో కూడా బిజీ కావాల్సి ఉంటుంది. ఇప్పటికే శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ ఓ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసారు. ఇటీవలే సెట్స్ కి వెళ్లిన యూనిట్ మొదటి షెడ్యూల్ ని దిగ్విజయం గా ముగించింది. ప్రస్తుతం శివ అండ్ క్రూ విశ్రాంతిలో ఉంది. తదుపరి షెడ్యూల్ కి రెడీ అవుతోం ది. అయితే మే లో గనుక పూరి సినిమా మొదలైతే రెండు సినిమా షూటింగ్ లకు విజయ్ ఒకేసారి హాజరు కావాల్సి ఉంది. రెండు వేర్వే రు చోట్ల షూటింగ్ జరిగే అవకాశం ఉంది. శివ సినిమా హైదరాబాద్లో షూట్ జరుగుతుంటే.. పూరి సినిమా ముంబైలో జరుగుతుంది. ఆ లెక్కన విజయ్ ముంబై టూ హైదరాబాద్ జర్నీ తప్పదు. ఈ ఏడాది చివరకల్లా రెండు సినిమా షూటింగ్ లు పూర్తి చేసి రిలీజ్ చేయానల్నది ప్లాన్ గా కనిపిస్తుంది. కుదరకపోతే వచ్చే ఏడాది ఆరంభంలోనైనా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు తీసుకురావా లని ప్లాన్ చేస్తున్నారుట. శివ సిని మాలో విజయ్ కి హీరోయిన్ గా సమంత.. జాన్వీ కపూర్ లలో ఒకరు ఎంపికైనట్లు టాక్ వినిపిస్తుంది. జాన్వీ పేరే బలంగా వినిపిస్తుంది. మరి ఎవరిని ఎంపిక చేసారు? అన్న ది యూనిట్ రివీల్ చేస్తే గానీ క్లారటీ రాదు.

# 22న 'ఎఫ్ 3' నుంచి సర్ ప్రైజ్!




విక్టరీ వెంకటేష్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోలుగా టాలెంటెడ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'ఎఫ్ 3' సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నాడు. తన ఎనర్జిటిక్ సాంగ్స్ తో సినిమా స్థాయిని పెంచుతున్నాడు దేవి. కాగా ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్‌లలో భాగంగా, ఏప్రిల్ 22న ఈ సినిమా రెండో సాంగ్ ను 'ఓ.. ఆ.. ఆహా ఆహా'ను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ పోస్టర్ ను కూడా వదిలారు. పోస్టర్ లో హీరోయిన్స్ ఒక పక్క, మరోపక్క హీరోలిద్దరూ తాడు లాగుతూ కనిపించారు. మొత్తానికి పోస్టర్ ఇంట్రెస్టింగ్ గా ఉంది. పోస్టర్ లో తమన్నా మాత్రం చాలా గ్లామర్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా స్పెషల్ సాంగ్ లో పూజా హెగ్డే నటించిన సంగతి తెలిసిందే. దిల్ రాజు సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ నిర్మిస్తున్నారు.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com